Licensed to post without Prepayment No. J/Nellore/003/2018-20 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03






# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com



## వైసిపి - టీడీపీల మధ్య
# పల్నాటి యుద్ధం

- గోరంతను కొండంత చేస్తున్న చంద్రబాబు
- అవినీతి కేసుల నుండి దృష్టి మళ్లించే ప్రయత్నం
- తమ్ముళ్ళు అరెస్ట్ కాకుండా కాపాడుకోవడానికే ఈ అడ్డదారులు

**మహానటుడు నందమూరి తారక రామారావు స్థాపించిన పార్టీ తెలుగుదేశం. అయితే ఆయన సినిమాలలో నటించాడేగాని పార్టీ పెట్టాక రాజకీయాలలో ఎప్పుడూ నటించలేదు. సహజశైలిలోనే నడుచుకున్నాడు. కపటం తెలియకుండా రాజకీయాల్లో వ్యవహరించాడు. అలా నటించకుండా నిజాయితీతో పని చేశాడు కాబట్టే తనవాళ్ళు అనుకున్న వాళ్ళ చేతే రెండుసార్లు వెన్నుపోటు పొడిపించుకున్నాడు.**

ఎన్టీఆర్ రాజకీయాలలో నటించకపోయినా, ఆ పార్టీలో మహానటులకు, వారి నటనాభినయానికి కొదవలేదు. వారిలో చంద్రబాబు మేటి నటుడు. చాలామంది నాయకులు నటవిఖ్యాతలు కూడా! ఈమధ్య ఇలాంటి నటనా రాయుళ్ళతోనే ఆ పార్టీ బండారం బయటపడింది. రైతు వేషంలో ఒకాయన, కూలీ వేషంలో ఇంకొక నాయకుడు సోషల్ మీడియా ద్వారా జగన్‌ను విమర్శిస్తూ వైసిపి సోషల్ మీడియా విభాగం చేతికి చిక్కారు. ఇవి జరిగాక ఇప్పుడు తెలుగుదేశంవాళ్ళు ఏ కార్యక్రమం చేసినా నాటకాలే గుర్తుకొస్తున్నాయి.

ఇప్పుడు పల్నాడు వేదికగా జరుగుతున్న సంఘటనలు కూడా ఇలాంటి నాటకాన్నే తలపిస్తున్నాయి. గుంటూరుజిల్లా దుర్గి మండలం ఆత్మకూరు గ్రామంలో ఇరు వర్గాల మధ్య జరిగిన ఘర్షణను చంద్రబాబు భూతద్దంలో చూపిస్తున్నాడు. వైసిపి అధికారంలోకి రాగానే అరాచకాలు పెరిగిపోయాయంటూ 'ఛలో ఆత్మకూరు' అనే కొత్త కార్యక్రమం పెట్టాడు. 'వైసిపి బాధితుల పునరావాస శిబిరాలు' అంటూ కొన్ని సెంటర్‌లు కూడా ఏర్పాటు చేశారు. ఘర్షణ జరిగింది ఒక గ్రామంలో... ఇది పోలీసుల పరిధిలో వున్న విషయం. గ్రామస్థులను పోలీసులు పిలిచి రాజీ చేస్తే పరిష్కారమయ్యే అంశం.

కాని, చంద్రబాబుకు ప్రభుత్వంపై దుమ్మెత్తి పోయడానికి ఏదో ఒక సబ్జెక్ట్ కావాలి. అంతేకాదు, అసలు విషయం తన అనుచరులు మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, మాజీస్పీకర్ కోడెల శివప్రసాద్‌రావులను అవినీతి కేసుల నుండి కాపాడుకోవాలి. ప్రస్తుతం పల్నాడు సీమలో కేసులన్నీ వీళ్లిద్దరి చుట్టే తిరుగుతున్నాయి. పల్నాడులో కోడెల కుటుంబం ఎలాంటి అరాచకాలకు పాల్పడిందో తెలియంది కాదు. 'కె'టాక్స్ పేరుతో వాళ్ళు చేసిన వసూళ్ళ గురించి రాష్ట్రానికంతా తెలిసిందే! ఆఖరకు తెలుగుదేశంవాళ్లు కూడా వాళ్ళ కుటుంబ బాధితులే! ఇక అసెంబ్లీ ఫర్నీచర్‌ను ఇంటిలో, షోరూమ్‌లలో పెట్టుకున్న ఘనచరిత్ర కోడెలది. ఇక గత


(మిగతా 11వ పేజీలో)



## తెలుగుకు...
# కొత్త వెలుగు
## నెల్లూరుకి ప్రాచీన పీఠం

మహాభారతాన్ని అత్యద్భుతంగా ఆంధ్రీకరించి తెలుగుభాషామతల్లికి కంఠహారంగా సమర్పించిన కవిబ్రహ్మ తిక్కన పుట్టిన నెల్లూరుసీమలో మళ్ళీ ఇన్నాళ్ళకు.. ఇన్నేళ్ళకు తెలుగుకు కొత్త వైభవం రానుంది.

10లో



## రివర్స్‌తో...
# 'మెగా'కే పోల'వరం'?

ఆంధ్రప్రదేశ్ జీవనాడి పోలవరం ప్రాజెక్ట్. గత ఐదేళ్లుగా రాష్ట్ర రాజకీయాలలో కూడా ఇది హాట్‌టాపిక్. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్మించాల్సిన ఈ ప్రాజెక్ట్‌ను దేనికో కక్కుర్తిపడి రాష్ట్ర ప్రభుత్వం ద్వారా చేయిస్తామంటూ గత ముఖ్యమంత్రి చంద్రబాబు తీసుకోవడం తెలిసిందే! మొదట ఈ ప్రాజెక్ట్ కాంట్రాక్ట్‌ను ట్రాన్స్‌టాయ్ సంస్థకు అప్పగించినా, పనులు నత్తనడకన సాగిస్తుండడంతో అప్పుడు కేంద్రంలో జలవనరుల శాఖ మంత్రిగా వున్న నితిన్ గడ్కరీ జోక్యం చేసుకుని నిర్మాణ రంగంలో మంచి పేరున్న నవయుగ ఇంజనీరింగ్ కంపెనీకి ఈ పనులు అప్పగించారు. అది కూడా పాత అంచనాల ప్రకారమే పనులు చేయాలని చెప్పి ఇచ్చారు. నవయుగ వాళ్లు కూడా వేగవంతంగానే నిర్మాణ పనులు చేపట్టారు. గిన్నిస్ రికార్డు స్థాయిలో ఒకేరోజు స్పిల్‌వే కాంక్రీట్ పనులు చేశారు. ఈ దశలోనే సోమవారం 'పోలవరం' అంటూ చంద్రబాబు ప్రతి సోమవారం పోలవరం సందర్శన పెట్టుకున్నారు.

వైసిపి అధికారంలోకి వచ్చాక గత తెలుగుదేశం ప్రభుత్వంలో జరిగిన అన్ని ప్రధాన కాంట్రాక్ట్‌లపై పున:సమీక్షలకు సీఎం జగన్ పూనుకున్నాడు. చంద్రబాబు హయాంలో అధిక అంచనాలతో కాంట్రాక్ట్‌లు దక్కించుకున్నారన్నది జగన్ ఆలోచన. ఈ మిగులు ముడుపులన్నీ చంద్రబాబుకే చేరాయని ఆయన అభిప్రాయం. అందుకే రివర్స్ టెండరింగ్‌కు శ్రీకారం చుట్టాడు. ఈ క్రమంలోనే

(మిగతా 11వ పేజీలో)



## దేశానికి...
# రెండో రాజధానిగా 'భాగ్యనగరం'?

***హైదరాబాద్ నగరం... ఉభయ తెలుగు రాష్ట్రాలు కట్టిన పన్నులతో అభివృద్ధి చెందిన నగరం. దేశంలోని ప్రధాన నగరాలన్నింటిలోకెల్లా అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరం. అన్ని భాషలు, అన్ని మతాలు, దేశంలోని అన్ని రాష్ట్రాల ప్రజలు సమైక్యంగా నివసించే నగరం. 2014లో జరిగిన రాష్ట్ర విభజనతో కేవలం తెలంగాణకు మాత్రమే రాజధానిగా మిగిలిన నగరం.***

ఈ నగరంపై కేంద్ర ప్రభుత్వం త్వరలో ఏదన్నా చారిత్రాత్మక నిర్ణయం తీసుకోబోతోందా? ఇటీవల కాలంలో ఈ ప్రశ్న ఎక్కువుగా వినిపిస్తోంది. దానికి అవుననే సమాధానం కూడా వినిపిస్తోంది. హైదరాబాద్‌ను దేశానికి రెండో రాజధానిగా చేయాలని కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. హైదరాబాద్‌ను కేంద్ర పాలిత ప్రాంతంగా చేసి, వరంగల్‌ను తెలంగాణకు రాజధానిగా అభివృద్ధి చేస్తారనే ప్రచారం జరుగుతోంది. దేశ రాజదానిగా వున్న ఢిల్లీ ఉత్తర భారతదేశంలో వున్నందున, దక్షిణ భారత దేశంలోనూ ఒక రాజధాని నగరం వుండాలని, అత్యవసర పరిస్థితుల్లో దేశ పరిపాలన సాగించడానికి ఇది అవసరమనే ఒక ఆలోచన కూడా కేంద్రంలో జరుగుతున్నట్లు సమాచారం.

(మిగతా 11వ పేజీలో)

# ఊహించని ఉపకారం



## ○ నేల తడిసే వాన లేకున్నా నిండుగా నీళ్లొచ్చాయ్...

*రాయలసీమ మరియు నెల్లూరుజిల్లా ప్రజలు తమ జీవితాలలో ఇద్దరు మహా నాయకులను బాగా గుర్తు పెట్టుకోవాలి. ఒకరు తెలుగుగంగ పథకానికి రూపకల్పన చేసిన స్వర్గీయ నందమూరి తారకరామా రావు అయితే, రెండోవారు జలయజ్ఞం ద్వారా ఈ ప్రాంతాలలో పెండింగ్ ప్రాజెక్ట్‌లను, కాలువలను పూర్తి చేయడమే కాక కొత్త ప్రాజెక్ట్‌లను నిర్మించిన డాక్టర్ వై.యస్.రాజశేఖరరెడ్డి. వారు వేసిన పునాదులు ఎంతటి బలమైనవంటే... నెల్లూరుజిల్లాలో నేల తడిసే వాన లేక పోయినా జిల్లాలో వున్న ఇరిగేషన్ ప్రాజెక్ట్‌లకు నిండుగా నీళ్లొస్తున్నాయి. అది కూడా నీళ్ళపై ఎటువంటి ఆశలు లేని సమయంలో!*

నెలక్రితం కర్నాటక, మహారాష్ట్రలలో కురిసిన భారీ వర్షాల మూలంగా కృష్ణానది వరద ప్రవాహం పోటెత్తడంతో ఆ నదిపై వున్న అన్ని ప్రాజెక్టులు నిండిపోవడం తెలిసిందే! ఈ వరద ప్రవాహం సమయంలోనే శ్రీశైలం రిజర్వాయర్ నుండి మిగులు జలాలను పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా తెలుగుగంగ కాలువలకు మళ్లించారు. రాయలసీమ జిల్లాలోని రిజర్వాయర్‌లతో పాటు సోమశిలకూ నీళ్లు చేరాయి. మొదటిసారి వరదలతో సోమశిల నీటి మట్టం 25 టీఎంసీల దాకా చేరింది. తాజాగా మరోసారి కృష్ణా నది వరదతో పోటెత్తింది. శ్రీశైలం నుండి పూర్తి స్థాయిలో పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ ద్వారా నీళ్ళు విడుదల చేస్తున్నారు. కృష్ణానదిలో రెండోసారి వరద మూలంగా ఈసారి జిల్లాలోని సోమశిలతో పాటు కండ్లేరులోనూ కనీసం సగానికైనా నీటిని నింపే అవకాశముంది.

## జగన్ నిర్ణయంతో.. ఆర్టీసీలో పండుగ

ప్రజలకిచ్చిన మాటను నిలబెట్టుకోవడం దివంగత వైయస్సార్, ఆయన తనయుడు వైయస్ జగన్‌కు మాత్రమే సాధ్యమని ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షుడు సన్నపురెడ్డి పెంచలరెడ్డి పేర్కొన్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడంపై ఎంప్లాయిస్ యూనియన్ చేపట్టిన సంబరాల్లో భాగంగా ఈనెల 10న యూనియన్ నాయకులు నెల్లూరు రేబాల వారివీధిలో ఉన్న కార్యాలయంలో ఆయన్ను కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా పెంచలరెడ్డి మాట్లాడుతూ గతంలో 2 లక్షల మంది మునిసిపల్ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా చేసిన ఘనత వైయస్సార్‌కు దక్కుతుందన్నారు. ఇప్పుడు ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి మాట నిలబెట్టుకుని ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి చరిత్రలో నిలిచిపోయారన్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం వల్ల 52వేల మంది ఆర్టీసీ కార్మికులు ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తింపు పొందుతారన్నారు. ఎంప్లాయిస్ యూనియన్ జోనల్ కార్యదర్శి డి. బాబు శ్యామ్యుల్, ఈయూ నాయకులు సుబ్రహ్మణ్యం రాజు, నాగేశ్వరరావు, ప్రసాద్, శ్రీనివాసులురెడ్డి, ఛాంబర్ ఆఫ్ కామర్స్ నాయకులు దాసా లక్ష్మీ నారాయణ, మంచికంటి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## వేళాంగణిమాత ఆరాధనోత్సవాలు

తోటపల్లి గూడూరు మండలంలోని కోడూరులో కొలువైవున్న వేళాంగణిమాత చర్చిలో ఎంతో భక్తిశ్రద్ధలతో జరుగుతున్న ఆరాధనోత్సవాలు ఈనెల 8వతేదితో ముగిశాయి. చివరిరోజున జపమాల-నవదిన ప్రార్థనలను నిర్వహించారు. చర్చిలో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. దైవసందేశకులు రెవరెండ్ సిహెచ్ రమేష్, ఎంసి అరుల్, ఐ.కిరణ్, ఎస్‌పిఏ సురేష్, టి.మరియశౌరి తదితరులు భక్తులకు సందేశాలను అందించారు. ఎంతో మహిమాన్వితమైన దివ్యమహిమలు కలిగిన వేళాంగణిమాతను దర్శించుకుంటే సకల శుభాలు కలుగుతాయని పేర్కొన్నారు. ఈ ఆరాధనోత్సవాలతో వేళాంగణిమాత చర్చి ప్రాంగణం భక్తజనులతో క్రిక్కిరిసిపోయింది. అనంతరం అనేకమంది భక్తులు చెంతనే ఉన్న కోడూరు సాగరతీరంలో సముద్రస్నానాలు ఆచరించి పునీతులయ్యారు.

భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్చి డైరెక్టర్ థామస్ అగస్టీస్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కృష్ణపట్నం పోర్ట్ సిఐ ఖాజావలి, ఎస్ఐ మనోజ్‌కుమార్‌ల ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది గట్టి బందోబస్తు ఏర్పాటుచేశారు.

## అనాధలకు.. ఎల్ఐసి వితరణ

జీవితబీమా వారోత్సవాల ముగింపు సందర్భంగా నెల్లూరులోని ఎల్ఐసి సిటీ బ్రాంచ్-1, ఎల్ఐసి ఏజెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా బ్రాంచ్-1 ఆధ్వర్యంలో స్థానిక భక్తవత్సలనగర్‌లో ఉన్న నిర్మల హృదయ్‌భవన్‌లోని అనాధలు, వికలాంగులు, వృద్ధులకు ఒక నెలకు సరిపడా 30 బస్తాల బియ్యాన్ని వితరణగా అందజేశారు. ఎల్ఐసి 63వ బీమా వారోత్సవాలను పురస్కరించుకుని ఈ వితరణ నిర్వహించారు. ఈ నెల 8న నిర్వహించిన ఈ కార్యక్రమంలో నెల్లూరు, చిత్తూరు, ప్రకాశం జిల్లాల డివిజినల్ మార్కెటింగ్ మేనేజర్ దారా శ్రీకాంత్ మాట్లాడుతూ ఎల్ఐసి కేవలం వ్యాపార దృక్పథంతోనే కాక, సమాజ సేవా కార్యక్రమాలకు కూడా తనవంతు చేయూతనందిస్తోందని పేర్కొన్నారు. మేనేజర్ అబ్దుల్ అజీమ్, ఎబిఎం జనార్దన్, ఫెడరేషన్ నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, విజయభాస్కర్, బాబురావు, వైఎస్‌వి మూర్తి, ఎన్‌వి కృష్ణయ్య, ఎన్.సుధాభాస్కర్, షేక్ జావీద్, మహబూబ్‌బాషా, జివిబి మురళి తదితరులు పాల్గొన్నారు.

### 'ఇన్‌స్పైర్ మనక్'లో..

## జిల్లాకు 5వ స్థానం

2019-20 సంవత్సరానికి ఇన్‌స్పైర్ మనక్‌లో జాతీయస్థాయిలో జిల్లా 5వ స్థానంలో నిలిచిందని జిల్లా సైన్స్ అధికారి జి.శ్రీనివాసులు తెలియజేశారు. వెంకటాచలం మండలంలోని చెముడుగుంట వద్ద ఉన్న జిల్లా సైన్స్ కేంద్రంలో ఈనెల 8న ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 1014 ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు నామినేషన్లలో పాల్గొన్నాయని, అందులో 3,640 ప్రాజెక్టులను విద్యార్థులు అప్‌లోడ్ చేయించారని తెలిపారు. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి జులై వరకు కేవలం 6 ప్రాజెక్టులు మాత్రమే జిల్లావ్యాప్తంగా నామినేట్ అయ్యాయని, జులై 16 నుంచి సెప్టెంబర్ 2వ తేది వరకు 47 రోజుల వ్యవధిలో జిల్లావ్యాప్తంగా 1012 పాఠశాలల నుంచి 3,634 ప్రాజెక్టులను నామినేట్ చేయించామని, ఇది జిల్లా చరిత్రలోనే ఒక రికార్డు అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ సైన్స్ అధికారులు ఐ.నారాయణ, డి.వెంకటేశ్వర్లు, ఐ.భాస్కర్ రావు, ఏ.తిరుమలేష్, రత్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

### అక్టోబర్ 2 నుంచి

## కొత్త రిజిస్ట్రేషన్ విధానం



ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో దళారీ వ్యవస్థకు ప్రభుత్వం చరమగీతం పాడనుంది. స్థిరాస్తి లావాదేవీల రిజిస్ట్రేషన్ ప్రక్రియను మరింత సరళతరం చేసి పబ్లిక్ డేటా ఎంట్రీకి శ్రీకారం చుట్టనుంది. ఏపీలోని విశాఖలో ఈ పైలెట్ ప్రాజెక్ట్‌ను ప్రారంభించనున్నట్లు సమాచారం. మరోవైపు అవినీతిపరులను నియంత్రించేందుకు ఏసీబీ నిర్వహిస్తున్న ఆకస్మిక తనిఖీల్లో అనధికార సిబ్బంది హవా బయటపడడం వారిలో ఆందోళన కలిగిస్తోంది. రిజిస్ట్రేషన్ శాఖలో సంస్కరణలకు శ్రీకారం చుట్టిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడు మరో అడుగు ముందుకేసింది. డాక్యుమెంట్ రైటర్ల పెత్తనానికి కత్తెర వేయనుంది. వాళ్ళ ప్రమేయం లేకుండానే స్థిరాస్తి అమ్మకాలు, కొనుగోళ్ళు జరిగేలా చర్యలు చేపడుతోంది. సులభ రిజిస్ట్రేషన్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తోంది. దీనికి సంబంధించి విశాఖ జిల్లాలో అక్టోబర్ 2 నుంచి పైలెట్ ప్రాజెక్ట్‌ను ప్రారంభిస్తున్నట్లు తెలిసింది. ప్రభుత్వం సూచించిన విధంగా డాక్యుమెంట్ రిజిస్టర్ చేసుకుంటే లంచాల బాధ తప్పిపోతుంది. రిజిస్టర్ డాక్యుమెంట్లు ఎలా రాయించుకోవాలో తెలియక ప్రజలు డాక్యుమెంట్ రైటర్లను ఆశ్రయిస్తున్నారు. దీంతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో దళారులు రాజ్యమేలుతున్నారు. కొందరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ ఉద్యోగులే దళారులను పెంచి పోషిస్తున్నారు. రైటర్ల అవసరం లేకుండా ఎవరికి వారే డాక్యుమెంట్లు తయారు చేసుకునే విధంగా ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం. దీనికి పబ్లిక్ డేటాఎంట్రీ విధానమని పేరు పెట్టారు. ఈ నూతన విధానంలో డాక్యుమెంట్ రైటర్ అవసరం ఉండదు. దళారీలకు లంచాలు ఇవ్వాల్సిన అవసరం ఉండదు. ఈ విధానాన్ని ఇప్పుడు విశాఖలో పరిశీలించనున్నట్లు సమాచారం.

## ఐదేళ్ళలో వెలిగొండను పూర్తిచేస్తాం

రాబోయే ఐదేళ్ళలో వెలిగొండ ప్రాజెక్ట్ ను ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి చొరవతో పూర్తి చేసి ఉదయగిరి నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేస్తామని ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. ఈనెల 10న వింజమూరు వీఆర్ ఫంక్షన్ ప్లాజాలో ఆంధ్రప్రదేశ్ అన్‌ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉదయగిరి నియోజకవర్గస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులకు బెస్ట్ టీచర్ అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వింజమూరును మునిసిపాలిటీని చేస్తామని, 100 రోజుల పాలనలోనే అన్ని వర్గాలను ఆకట్టుకున్నామన్నారు. మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి, మంత్రులు మేకపాటి గౌతంరెడ్డి, అనిల్‌కుమార్ యాదవ్ సహకారంతో ఉదయగిరి నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేస్తామన్నారు. రిటైర్డు డీఎంహెచ్ఓ కె.మాసిలామణి, వింజమూరు, దుత్తలూరు ఎంఈఓలు మాలకొండరావు, మోహన్‌రావు, అపస్మా ప్రతినిధులు ఎంవి సుబ్బారెడ్డి, యన్.శ్రీధర్, బి.మనోహర్‌రెడ్డి, రమణారెడ్డి, జి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ ఉపాధ్యాయులకు కలెక్టర్ అభినందన

రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందిన సంగం మండలానికి చెందిన ఇద్దరు ఉపాధ్యాయులను జిల్లా కలెక్టర్ ఎం.వి శేషగిరిబాబు అభినందించారు. నెల్లూరులోని కలెక్టర్ కార్యాలయంలో ఇటీవల జరిగిన ఈ కార్యక్రమంలో సంగం మండలం మర్రిపాడు ఆదర్శపాఠశాలకు చెందిన ఎల్లసిరి శాంతకుమారి, అన్నారెడ్డిపాళెం జడ్పీ ఉన్నతపాఠశాల ఉపాధ్యాయుడు ఎం.విజయప్రదీప్, పొదలకూరు జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అబ్దుల్ హమీద్, వ్యాయామ ఉపాధ్యాయుడు ఎం.చంద్రశేఖర్‌లను జిల్లా కలెక్టర్ అభినందించారు. అదేవిధంగా, వైకల్యంతో ఉన్నా వెరవక విధి నిర్వహణలో ప్రతిభ చూపుతూ ఈనెల 5వ తేదీన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చేతుల మీదుగా రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందుకున్న నెల్లూరు కొండాయపాళెం ఎస్‌సి కాలనీలోని ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మేకల భాస్కర్‌రావును జిల్లా కలెక్టర్ అభినందించారు.

## చదువుతోనే మంచి సమాజం

**- డిఇఓ జనార్దనాచార్యులు**

సంపూర్ణ అక్షరాస్యతతోనే దేశప్రగతి సాధ్యమని, ప్రతి ఒక్కరూ చదువుకోవాలని, చదువుతోనే ఉన్నతమైన సమాజం ఏర్పడుతుందని జిల్లా విద్యాశాఖ అధికారి జనార్దనాచార్యులు అన్నారు. బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని రామచంద్రాపురం గురుకులపాఠశాలలో ఈనెల 8న నిర్వహించిన 53వ అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం, వ్యాసరచన పోటీల్లో విజేతలైన వారికి బహుమతులు అందజేశారు. ఎంఇఓ దిలీప్‌కుమార్, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఏ.పద్మశ్రీ, శ్రీనివాసరావు, ఏపిఓ సుధాకర్‌రాజు, రమేష్, మస్తాన్‌రెడ్డి పాల్గొన్నారు.



నెల్లూరులోని బారా షహీద్ దర్గా రొట్టెల పండుగలో పాల్గొన్న రాష్ట్ర ఉపముఖ్యమంత్రి అంజాద్ బాషా, మంత్రులు పి.అనిల్‌కుమార్‌యాదవ్, మేకపాటి గౌతమ్‌రెడ్డి, ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, వైసిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, ఆనం విజయకుమార్‌రెడ్డి, ముక్కాల ద్వారకానాథ్, కొండ్రెడ్డి రంగారెడ్డి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి

# చంద్రబాబు రాజకీయ టెర్రరిస్ట్

## - కోవూరు ఎమ్మెల్యే ప్రసన్న



అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్న, కలెక్టర్ ఎం.వి.శేషగిరిబాబు

మాజీముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజాస్వామ్య విలువలు, శాంతి భద్రతల గురించి మాట్లాడుతుంటే బిన్ లాడెన్ శాంతి సందేశం వినిపిస్తున్నట్లుగా వుందని కోవూరు శాసనసభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి విమర్శించాడు.

11వ తేదీ బుచ్చిరెడ్డిపాలెంలో జిల్లా కలెక్టర్ ఎం.వి.శేషగిరిబాబుతో కలిసి ఆయన పలు అభివృద్ధి పనులకు శంకు స్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో ప్రసన్న మాట్లా డుతూ గత ఎన్నికల్లో ఓటమిని తట్టుకోలేని చంద్రబాబు రాజకీయ టెర్రరిస్ట్‌గా మారా డని, రాష్ట్రంలో శాంతి భద్రతలను విచ్ఛిన్నం చేయడానికి కుట్ర పన్నుతున్నాడని ఆరోపించాడు. ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఎన్నడూ లేని దురాగతాలు గత 5ఏళ్ల చంద్రబాబు పాలనలో జరిగాయి. కోడెల శివప్రసాద్‌రావు, సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, యరపతినేని శ్రీనివాసరావు, చింతమ నేని ప్రభాకర్, పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి లాంటివాళ్ళు సాగించిన మైనింగ్ మాఫియా, భూదందాలు గురించి అందరికీ తెలుసు. అసెంబ్లీలో ఫర్నీచర్‌ను దొంగలించి తన ఇంట్లో పెట్టుకున్న ఘనుడు కోడెల శివ ప్రసాద్‌రావు. తహశీల్దార్ వనజాక్షిని చింతమనేని ప్రభాకర్ ఇసుకలో జుట్టుపట్టి ఈడ్చి కొట్టినా చర్యలు లేవు. గత ఐదేళ్లలో జరిగిన అరాచకాలకు లెక్కేలేదు. చంద్ర బాబు ఐదేళ్ల పాలన రౌడీరాజ్యాన్ని తలపిం చింది. తన క్రింద ఇంత నలుపు పెట్టుకుని వందరోజుల పాలనలోనే ప్రజలకిచ్చిన హామీలన్నింటిని నెరవేర్చిన జగన్ ప్రభు త్వాన్ని చంద్రబాబు విమర్శించడం సిగ్గుచేటన్నారు.

ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు ఇప్పగుంట విజయభాస్కర్‌రెడ్డి, సూరా శ్రీనివాసులురెడ్డి, కలువ బాలశంకర్‌రెడ్డి, చీమల రమేష్‌బాబు, టంగుటూరు మల్లి ఖార్జునరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

## సోమిరెడ్డిని 41ఏ క్రింద విచారించండి

వెంకటాచలం మండలం ఇడిమే పల్లిలో భూమి కొనుగోలుకు సంబంధించి మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డిపై వెంకటాచలం పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు కావడం తెలిసిందే! ఈ కేసులో సిఆర్‌పిసి 160, 91 సెక్షన్ల క్రింద పోలీసులు సోమిరెడ్డికి నోటీసులిచ్చారు. అయితే ఈ కేసు కొట్టేయాలని కోరుతూ సోమిరెడ్డి హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశాడు. ఈ పిటిషన్‌ను విచారిం చిన హైకోర్టు సోమిరెడ్డిని 41ఏ క్రింద విచారించాలని పోలీసులను ఆదేశిం చింది. తదుపరి విచారణను ఈ నెల 17వ తేదీకి వాయిదా వేసింది.



# ఉప ముఖ్యమంత్రిని కలిసిన ఉన్నతాధికారులు

ఈ నెల 12వ తేదీ బారాషహీద్ దర్గా రొట్టెల పండుగలో పాల్గొనేందుకు నెల్లూరుకొచ్చిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషాను జిల్లా కలెక్టర్ ఎం.వి. శేషగిరిబాబు, ఎస్పీ ఐశ్వర్య రస్తోగిలు ఆర్ అండ్ బి అతిథిగృహంలో మర్యాద పూర్వకంగా కలిశారు. పలు అంశాలపై వారు చర్చించుకున్నారు.

# కాదలూరు అభివృద్ధికి కృషి చేస్తా

## ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

కాదలూరును ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు తనవంతు కృషి చేస్తానని సూళ్లూరుపేట శాసనసభ్యులు కిలివేటి సంజీవయ్య తెలిపారు. ఈ నెల 9వ తేదీన సూళ్లూరుపేట మండలం కాదలూరు గ్రామంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించిన ఆయన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం కాదలూరు గ్రామంలో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేదని, పంచాయితీ ద్వారా సరఫరా చేసే తాగునీరు అందరికీ అందడం లేదని గ్రామస్తులు ఎమ్మెల్యే సంజీవయ్యకి విన్నవించారు. అంగన్‌వాడీ భవనం శిధిలావస్థకు చేరిందని, నూతన భవనం నిర్మించాలని వైయస్సార్సీపీ నాయకులు మారంరెడ్డి మునీర్‌రెడ్డి కోరారు. వ్యవసాయ విద్యుత్‌లో సమస్యలు తలెత్తుతుండడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. పట్టాదారు పాసుపుస్తకాల కోసం రైతులు ఏళ్లతరబడి ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగి తిరిగి విసిగిపోయున్నారని తెలిపారు. స్థానిక పరిశ్రమల్లో స్వీపర్ ఉద్యోగాలు తప్ప ఉన్నత ఉద్యోగాలు అనేవి స్థానికులకు లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రజల తమ సమస్యలు విన్నవించిన అనంతరం స్పందించిన ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య మాట్లాడుతూ సమస్యల పరిష్కారంపై దృష్టి సారించి, తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గ్రామంలోని పాఠశాలను మోడల్ పాఠశాలగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. విద్యా ప్రమాణాలు మెరుగుపడేందుకు అధికారులు పూర్తిస్థాయిలో సహకరించాలని కోరారు.

# కలెక్టర్‌కు సీఎం ప్రశంస



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'స్పందన' కార్యక్రమం అమలులో నెల్లూరుజిల్లా ముందుందని, కలెక్టర్ పనితీరు బాగుందంటూ ముఖ్యమంత్రి వై.యస్.జగన్మోహన్‌రెడ్డి జిల్లా కలెక్టర్ ఎం.వి.శేషగిరిబాబును మెచ్చుకున్నారు. 11వ తేదీ ముఖ్యమంత్రి వై.యస్.జగన్మోహన్‌రెడ్డి అమరావతిలోని సచివాలయం నుండి అన్ని జిల్లాల కలెక్టర్లు, జేసీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాల వారీగా స్పందన కార్యక్రమం అమలు, గ్రామ సచివాలయ పరీక్షలు, జిల్లాల వారీగా సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి పనులపై సమీక్షించారు. ఈ అంశాలలో నెల్లూరు కలెక్టర్ పనితీరు బాగుందంటూ జగన్ అభినందించారు.

## ఎస్ఎస్ఏ పిఓగా బాధ్యతలు తీసుకున్న బ్రహ్మానందరెడ్డి



జిల్లా సర్వశిక్ష అభియాన్ ప్రాజెక్ట్ ఆఫీసర్‌గా వాకా బ్రహ్మానందరెడ్డి 11వతేదీ నెల్లూరులోని తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర సర్వశిక్ష అభియాన్ కార్యాలయం నుండి బదిలీపై ఆయన ఇక్కడకు వచ్చారు. ఇన్‌ఛార్జి ప్రాజెక్ట్ అధికారిగా వున్న డిఇఓ జనార్ధనాచార్యుల నుండి బాధ్యతలు తీసుకున్న అనంతరం ఆయన కలెక్టర్ శేషగిరి బాబును మర్యాదపూర్వకంగా కలిశారు.


## 'ప్రభా'తం

"చంద్రుడిపై ల్యాండర్‌ను ఆర్బిటర్ గుర్తించింది. చంద్రుని ఉపరితలం మీద మృదువుగా కాక, గట్టిగా ఢీకొట్టి ఉండొచ్చు. అయినా చందమామ దక్షిణ ధృవాన్ని చేరుకున్న తొలి దేశంగా భారత్ ఘనత సాధించింది"..

***ఇస్రో చైర్మెన్ శివన్.***

# సంచలనాత్మక విజయం

**చందమామ ఉపరితలంపై విక్రమ్ ల్యాండర్ భద్రంగా ఉందనే తాజా సమాచారంతో ఇస్రో శాస్త్రవేత్తల్లోనూ, కోట్లాదిమంది భారత ప్రజల్లోనూ ఆనందం వ్యక్తమవుతోంది. ల్యాండర్‌ను సక్రమంగా పనిచేయించేందుకు శాస్త్రవేత్తలు గట్టిగా కృషి చేస్తున్నారు. ఏదేమైనా, చంద్రమండలంలోని దక్షిణ ధృవంపై భారత్ పంపిన విక్రమ్ ల్యాండర్ దిగడమే ఒక అపూర్వమైన విజయం. చందమామ దక్షిణ ధృవాన్ని తాకిన తొలి దేశంగా భారత్ చరిత్రలో నిలచిపోతుందనడంలో ఎలాంటి సందేహం లేదు.**



కోట్లాదిమంది భారతీయుల కలలకు ప్రతిరూపమైన చంద్రయాన్-2 ప్రయోగం భారత్‌కు ఎనలేని కీర్తిప్రతిష్టలను తెచ్చిపెట్టింది. చంద్రమండలంలోని దక్షిణ ధృవంపై భారత్ పంపిన విక్రమ్ ల్యాండర్ దిగడమే ఒక అపూర్వమైన విజయం. అది సున్నితంగా దిగినా, వేగంగా దిగినా జాబిల్లి దక్షిణ ధృవంపై నిర్దేశిత ప్రాంతానికి చేరువలో ల్యాండ్ అవడంతో చంద్రుడిపై భారత్ ల్యాండర్ అడుగిడినట్లే. దీంతో చందమామ పైకి చేరిన నాల్గవ దేశంగా భారత్ ఘనత సాధించింది. అంతేకాదు, చందమామ దక్షిణ ధృవాన్ని తాకిన తొలి దేశంగా భారత్ కీర్తి చరిత్రలో నిలచిపోతుందనడంలో ఎలాంటి సందేహం లేదు.

చందమామ ఉపరితలంపై విక్రమ్ ల్యాండర్ భద్రంగా ఉందనే తాజా సమాచారం అందరిలోనూ సంతోషం కలిగిస్తోంది. దీంతో, ఇస్రో శాస్త్రవేత్తల ప్రయోగం పూర్తిస్థాయిలో సఫలీకృతమయ్యేందుకు అవకాశాలు బాగా మెరుగయ్యాయని అందరూ భావిస్తున్నారు. ల్యాండర్‌ను సక్రమంగా పని చేయించేందుకు శాస్త్రవేత్తలు గట్టిగా కృషి చేస్తున్నారు. గంటకి 6వేల కిలోమీటర్ల వేగంతో అంతరిక్షంలో దూసుకు వెళ్తున్న ల్యాండర్ చందమామ ఉపరితలానికి 2.1 కిలోమీటర్ల ఎత్తుకు చేరువ కావడం, ఇక సురక్షితంగా చంద్రుని మీదకు ల్యాండర్ దిగుతుందని ప్రధాని మోడీతో సహా అందరూ వేచిచూస్తుండగా, చివరి నిమిషంలో ఒక్కసారిగా సిగ్నల్స్ పనిచేయకపోవడంతో ల్యాండర్ ఏమైందనే ఆందోళన కలగడం అందరికీ తెలిసిందే. ఒక్కోసారి అంతే. ఎంత జాగ్రత్తగా నడుస్తున్నా పొరపాటున పట్టుతప్పి జారిపోతుండడం అందరికీ అనుభవమే. అదేవిధంగా మనం పడిపోతామనుకున్న చోట పడిపోకుండా ఉండడం కూడా జరుగుతూ ఉంటుంది. జారిపోవడం ఎంత సహ జమో.. నిలదొక్కుకోగలగడం కూడా అంతే. ఇప్పుడు మన ల్యాండర్ విషయంలో జరిగిందిదే. ఏమైపోయిందో అనుకున్న ల్యాండర్ భద్రంగానే ఉందనే సమాచారం ఇప్పుడు అందరినీ సంతోషపెడుతోంది. అయినా, అత్యంత సాహసోపేతమైన అంతరిక్ష ప్రయోగాల్లో ఇలాంటి సమస్యలు ఎదురుకావడం సహజం. అయితే ఎవరూ నిరాశపడనక్కర లేదు. గట్టిగా కృషిచేస్తే వైఫల్యాలే చివరకు విజయాలకు మెట్లుగా ఒదిగిపోతాయి. ఇస్రో శాస్త్రవేత్తలు ఈ పరిణామంతో కొంత దిగాలు పడినా, ల్యాండర్ (విక్రమ్) భద్రంగానే ఉందనే ఆర్బిటర్ సమాచారంతో వారిలో ఆశలు చిగురించాయి. మరింత ఉత్సాహంతో ల్యాండర్‌ను సక్రమంగా పనిచేయించడానికి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. చంద్రయాన్-2 ప్రయోగం విజయవంతమై ప్రపంచదృష్టిని ఆకర్షించిన నేపథ్యంలో, విక్రమ్ ల్యాండర్ భద్రంగా ఉండడం, దాని ఆకృతి ఏమీ చెక్కుచెదరకుండా నిలచివుండడం ఎంతైనా సంతోషదాయకం. ఇప్పటికే దీనితో పాటు పంపిన ఆర్బిటర్ అద్భుతంగా పనిచేస్తూ ఉంది కూడా. ఇది ఏడేళ్ళపాటు చంద్రునిపై తన ప్రయోగాలను కొనసాగిస్తుంది. చంద్రుని కక్ష్యలో తిరుగుతున్న ఆర్బిటర్‌లోని కెమెరా పంపిన థర్మల్ ఛాయాచిత్రాలను బట్టి నిర్దేశిత ప్రదేశానికి అత్యంత సమీపంలోనే ల్యాండర్ ఉండడాన్ని శాస్త్రవేత్తలు గమనించారు. నిర్ణీత వేగం కన్నా మరింత వేగంగా కిందకు జారిపోయినప్పటికీ ల్యాండర్ విరిగిపోకుండా భద్రంగానే ఉందని, చంద్రుని ఉపరితలంపై ఒక పక్కకు ఒరిగిపోయినట్లుగా వుందని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. ల్యాండర్ జాడ తెలిసింది కనుక ఎలాగైనా దానిని మళ్ళీ సక్రమంగా పనిచేయించేందుకు శాస్త్రవేత్తలు అహర్నిశలు కృషి చేస్తున్నారు. ల్యాండర్, రోవర్‌ల జీవితకాలం (ఒక లూనార్ డే) 14 రోజులే కనుక ఏ ఒక్క క్షణాన్ని కూడా వృధా చేయకుండా శాస్త్రవేత్తలు రోజుకు 17 గంటలపాటు అవిశ్రాంతంగా పనిచేస్తూ ల్యాండర్ పునరుద్ధరణకు కృషిచేస్తున్నారు. వారి కృషి ఫలించాలని, తప్పకుండా ఫలిస్తుందని దేశప్రజలంతా కోరుకుంటున్నారు. ఈ సందర్భంలో ఇక్కడో మాట!.. చంద్రయాన్ ప్రయోగం ఎంతో ఉత్కంఠదశలో ఉన్నప్పుడు.. ల్యాండర్ నుంచి సిగ్నల్స్ అందకపోవడంతో ఇస్రో ఛైర్మెన్ శివన్ ఉద్వేగానికి గురై కంటతడి పెట్టినప్పుడు ప్రధాని మోదీ ఆయన్ను అక్కునచేర్చుకుని ఓదార్చడం, నిరాశపడవద్దని అనునయించడం, భుజం తట్టి ప్రోత్సహించడం దేశప్రజల్లో మోడీ పట్ల, మన శాస్త్రవేత్తల పట్ల ఉన్న గౌరవభావాన్ని, అంకిత భావాన్ని మరింతగా ఇనుమడింపజేశాయని చెప్పొచ్చు.

ఏదేమైనా ఇస్రో చేసిన చంద్రయాన్-2 సాహస ప్రయోగాన్ని ప్రపంచమంతా అభినందిస్తోంది. ల్యాండర్‌తో సంబంధాలు కోల్పోయినంత మాత్రాన నిరాశపడనక్కరలేదని, అన్వేషణ కొనసాగించాలని జపాన్ తదితర దేశాలు ఇప్పటికే ఇస్రో శాస్త్రవేత్తలకు సూచించాయి. అసలు చంద్రయాన్-2 ప్రయోగం ఎంతో క్లిష్టమైనది. ఇదే విధంగా గతంలో చంద్రునిపైకి చేసిన ప్రయోగాల్లో విజయవంతమైన దేశాలు కూడా ఒకసారి కాదు, పదేపదే ప్రయత్నాలు చేసిన తర్వాతనే విజయాలను చేజిక్కించుకున్నాయి. భారత్ కూడా విజయపథంలోనే ఉంది. ఇప్పటికే అమెరికా, జపాన్ తదితర దేశాలన్నీ భారత్ నిర్వహించిన చంద్రయాన్-2 ప్రయోగాన్ని ఎంతగానో అభినందించాయి. అంతరిక్ష పరిశోధనల్లో భారత్‌తో కలసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నామని చైనా ప్రకటించడం విశేషం. ఇలాంటి సాహసోపేత ప్రయోగాలు, అంతరిక్ష అన్వేషణలు ప్రపంచవ్యాప్తంగా నిరంతరం కొనసాగుతూనే ఉంటాయి. ఈ క్రమంలో చంద్రయాన్-2 కూడా విజయవంతమైన ఒక బృహత్తర ప్రయోగం. ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న అంతరిక్ష పరిశోధనల విజయాల పరంపరలో భారత్ ముందు వరుసలో ఉండడం ఎంతో గర్వకారణం.

# సకల దేవతా స్వరూపం.. గోమాత

గోమాత సకల దేవతా స్వరూపమని, గోమాతను పూజించడమంటే సకల దేవతలను ఆరాధించినట్లేనని, గోమాతను పూజించుకోవడం జన్మజన్మల పుణ్యమని కలువాయిలోని శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయం నిర్వాహకులు నరసయ్య అన్నారు. ఈ నెల 8న కలువాయిలో హిందూ ధర్మపరిరక్షణ సమితి సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన గోపూజల్లో ఆయన పాల్గొని మాట్లాడుతూ గోమాత అంటే ఎంత విశిష్టమైనదో వివరించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు సోమశేఖర్ గోపూజలు ఎంతో ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ హిందూ ధర్మరక్షణ సమితి ఆధ్వర్యంలో ప్రతినెలా 2వ ఆదివారం రోజున గోపూజా కార్యక్రమాలను ఒక్కోనెల ఒక్కో గ్రామంలోని ఒక్కో దేవాలయంలో ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నామని, పెద్దసంఖ్యలో భక్తులు ఈ పూజల్లో పాల్గొంటున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు నరసయ్యస్వామి, విజయమ్మలతో పాటు, ఆలయ కమిటీ సభ్యులు చల్లా భాస్కర్‌రెడ్డి, ఎన్.కృష్ణయ్య, ఎస్.రామచంద్రయ్య, ప్రసాద్‌శర్మ, నాగభూషణం శర్మ తదితరులు పాల్గొన్నారు.

# 15 నుంచి 'ఆయుష్మాన్ భారత్'

నెల్లూరుజిల్లాలో ఈనెల 15వతేదీ నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు ఆయుష్మాన్ భారత్ పక్వారా(పక్షోత్సవాలు) కార్యక్రమాన్ని నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎంవి శేషగిరిబాబు అధికారులను ఆదేశించారు. ఈనెల 9న కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఈ కార్యక్రమ ఏర్పాట్లపై వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు వైద్య ఆరోగ్య శాఖ, స్త్రీ శిశు సంక్షేమం, విద్య, పంచాయితీరాజ్, మునిసిపల్, రెవెన్యూ శాఖల సమన్వయంతో ఈ పక్షోత్సవాలను నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం నిర్వహించాలన్నారు. ఈనెల 15వతేదీన జిల్లా కేంద్రంతో సహా అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉప కేంద్రాల పరిధిలో ర్యాలీలు నిర్వహించాలన్నారు. వైద్య పరీక్షా శిబిరాలను నిర్వహించి పోషకాహారం లోపం వున్న పిల్లలను గుర్తించాలన్నారు. ఆయుష్మాన్ భారత్ పై విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన తదితర పోటీలు నిర్వహించి విజేతలను సత్కరించి బహుమతులు అందజేయాలన్నారు. 29వ తేదీన ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా డాక్టర్ వైయస్సార్ ఆరోగ్య పథకం ద్వారా ఇప్పటి వరకు ఉచితంగా గుండె జబ్బుల చికిత్సలు పొందిన లబ్దిదారులకు సన్మానం చేయాలన్నారు. అక్టోబర్ 1వ తేదీన ప్రపంచ వృద్ధుల దినోత్సవం సందర్భంగా అన్ని ప్రభుత్వ ఆసుపత్రులలో వృద్ధులకు ప్రత్యేక వార్డులు ఏర్పాటు చేసి చికిత్సలు అందించాలన్నారు.




# సంక్షేమం ముంచుతుంది!

సంక్షేమ పథకాలు మరీ ఎక్కువైతే ప్రజలు సోమరులవుతారు. ఉత్పాదన దెబ్బ తింటుంది. చివరకు రాజ్యం భ్రష్టుపట్టిపోతుంది. ఇలా సంక్షేమ పథకాలు ఎక్కువుగా అమలు చేసే వెనిజులా లాంటి దేశం ఇప్పుడు అడుక్కుతింటోంది. ఆంధ్రప్రదేశ్‌లో కూడా సంక్షేమ పథకాల అమలు మోతాదు ఎక్కువైంది. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి ఆదాయం వచ్చే దారులకంటే కూడా ప్రభుత్వ సొమ్ము తొందరగా ఖర్చయ్యే మార్గాలపై పూర్తిగా దృష్టి సారించాడు. ఆయన అమలు చేయాలనుకుంటున్న ఈ సంక్షేమ కార్యక్రమాలన్నింటికీ నిధులు ఎక్కడనుండి వస్తాయో అంతుబట్టడం లేదు. రాష్ట్రంలోని నిధులు ఈ సంక్షేమ పథకాల అమలుకు, జీతభత్యాల చెల్లింపులకు కూడా సరిపోవు. ఇక రాష్ట్రంలో రోడ్లు, కాలువలు, ఇతర మౌలిక వసతుల అభివృద్ధికి నిధులు ఎక్కడనుండి తెస్తారు?

**సంపంగి మోహన్‌రావు, నెల్లూరు.**

# ఇస్రోకు వెన్నుదన్ను

చంద్రయాన్-2 చివరి నిముషంలో కొంత విఫలమైనా ఈ ప్రయోగం ద్వారా ఇస్రో శాస్త్రవేత్తలు సాధించిన ఘనత తక్కువేమీ కాదు. అగ్రరాజ్యాలకంటే కూడా అత్యంత తక్కువ ఖర్చుతో చంద్రయాన్-2 ప్రయోగాన్ని నిర్వహించగలిగారు. ఈ ప్రయోగం సంపూర్ణ విజయం సాధించలేకపోయినందుకు శాస్త్రవేత్తలు చింతించాల్సిందేమీ లేదు. మరిన్ని ప్రయోగాలపై వాళ్ళు దృష్టి పెట్టాలి. చంద్రయాన్-2 ప్రయోగం విషయంలో ఇస్రో శాస్త్రవేత్తలకు ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఎంతో ధైర్యమిచ్చారు. వారికి వెన్నుదన్నుగా నిలిచారు. దేశమంతా కూడా ఇస్రోకు ఈ విషయంలో అండగా నిలవడం ఎంతైనా అభినందించదగ్గ విషయం.

**కందుల రాంసాగర్‌రెడ్డి, బద్వేల్.**

# ప్రజలు కట్టే పన్నులతో పాస్టర్‌లకు జీతాలేంటి?

ప్రభుత్వానికి అన్ని మతాల ప్రజలు పన్నులు కడతారు. ఈ పన్నులతో అన్ని వర్గాల ప్రజలకు సంబంధించిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చేపట్టాలి. అంతేగాని ఈ పన్నులు కట్టేవి మత మార్పిళ్ళను ప్రోత్సహించే పాస్టర్‌లకు జీతాలిచ్చేందుకు కాదు. హిందూ దేవాలయాలలో పూజారులకు జీతాలు ఆ దేవాలయాల నుండి వచ్చే ఆదాయంలోనే ఇస్తున్నప్పుడు పాస్టర్‌లకు కూడా చర్చిల ద్వారానే జీతాలు ఇవ్వాలి. పాస్టర్‌లకు జీతాలిచ్చుకుంటూ పోతే వీధికి నాలుగు లెక్కన చర్చిలు, చర్చికి నలుగురు పాస్టర్‌లు తయారవుతారు. ప్రభుత్వ స్థలాలు ఆక్రమించుకుని చర్చిలను కట్టడం కూడా ఎక్కువవుతుంది. కాబట్టి పాస్టర్‌లకు జీతాల నిర్ణయాన్ని సీఎం విరమించుకోవాలి.

**సి.రాజీవి, నెల్లూరు.**

# వైయస్సార్ నగర్‌ను పట్టించుకోండి

జగన్ ప్రభుత్వం వచ్చి 100రోజులు అయినా, నెల్లూరు నగరంలో ఒక్క అభివృద్ధి పని కూడా కనిపించడంలేదు. ఎక్కడి పనులు అక్కడే ఉన్నాయి. కనీసం జగన్ తండ్రి పేరు మీద ఉన్న వైయస్సార్‌నగర్‌నైనా పట్టించుకుంటే బాగుంటుంది. వర్షం పడితే... వై.యస్. కాలనీ మెయిన్‌రోడ్డు అయితే గుంతలమయమై మరీ ఘోరంగా తయారవుతోంది. ఈ దారిలో తారురోడ్డు పునరుద్ధరిస్తే బాగుంటుంది.

**- జె.యస్.కృష్ణ,** వైయస్సార్ నగర్.

# తప్పని తలనొప్పి..!

**పాతికేళ్ళుగా ప్రత్యర్థులు మారుతున్నా... సోమిరెడ్డికి మాత్రం యుద్ధం తప్పడం లేదు..!**



1994-2019.. దాదాపు పాతికేళ్ళు... జిల్లాలో 10 అసెంబ్లీ నియోజకవర్గాలుంటే అటు తెలుగుదేశమైనా, ఇటు కాంగ్రెస్ (ప్రస్తుతం వైసిపి)కైనా ఆయా నియోజక వర్గాల అభ్యర్థులు లేదా ఇన్‌ఛార్జ్‌లు మారుతూ వచ్చారు. పాతికేళ్ళ నుండి ఏ నియోజకవర్గానికి ఎవరూ ఏ పార్టీ తరపున శాశ్వత నాయకుడు లేదు. సూళ్లూరుపేట నుండి ఒక్క పరసా రత్నం కంటిన్యూగా వున్నప్పటికీ రాజకీయంగా అక్కడ పెద్ద ప్రాధాన్యత లేదు. పాతికేళ్ళుగా సర్వేపల్లి తెలుగుదేశం నాయకుడు సోమిరెడ్డే. తన పాతికేళ్ళ కెరీర్‌లో ముగ్గురు ప్రత్యర్థులతో ఎన్నికల్లోనే కాదు, ఎన్నికల తర్వాత కూడా విమర్శలు, ఎదురుదాడులతో తలపడ్డాడు. సర్వేపల్లి రాజకీయాల్లోకి ఆరంగేట్రం చేసిన తొలినాళ్ళలో సీనియర్ నాయకుడు సి.వి.శేషారెడ్డితో, ఆ తర్వాత 2004 నుండి 2014 దాకా ఆదాల ప్రభాకర్‌రెడ్డితో, 2014 నుండి ఇప్పటిదాకా కాకాణి గోవర్ధన్‌రెడ్డితో. సర్వేపల్లి నియోజకవర్గం అంటేనే రాజకీయ పోరుకు వేదికగా మారుతోంది.

ఈ అసెంబ్లీ ఎన్నికల తర్వాత ఏ నియోజకవర్గంలోనూ ఎమ్మెల్యేలకు వ్యతిరేకంగా విమర్శలు, ఆరోపణలు లేవు. ఎమ్మెల్యేలు ప్రతిపక్ష నాయకులను టార్గెట్ చేయడం లేదు. సర్వేపల్లిలో మాత్రం పాత సాంప్రదాయం కొనసాగుతోంది. ఎవరు అధికారంలో వుంటే వాళ్ళు ప్రత్యర్థులపై కేసులు పెట్టించే సంస్కృతి నడుస్తోంది.

గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో సోమిరెడ్డిపై నకిలీ ఎరువుల కుంభకోణం ఆరోపణలు వచ్చాయి. దీనిమీదే చాలారోజుల పాటు నాయకుల మధ్య విమర్శల యుద్ధం నడిచింది. తాజాగా సోమిరెడ్డిపై భూవివాదానికి సంబంధించిన కేసులు నమోదయ్యాయి. సర్వేపల్లి రాజకీయాలలో సెగ ఇప్పుడే ఆరంభమైంది. ఇది ఎంత దాకా పోతుందో చూడాలి?!



# స్థానిక పోరుకు... సిద్ధమేనా?

- **హామీలు అమలు చేశామంటూ అధికారపక్షం**
- **వందరోజుల పాలనపై వ్యతిరేకతతో ప్రతిపక్షం**

అక్టోబర్ తర్వాత స్థానిక ఎన్నికలకు వెళ్ళేందుకు రాష్ట్ర ప్రభుత్వం సమాయత్తమవుతున్నట్లు తెలుస్తోంది. స్థానిక ఎన్నికలకు వెళ్ళేలోపే సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలకిచ్చిన వాగ్ధానాలన్నింటినీ నెరవేర్చే దిశగా ముఖ్యమంత్రి వై.యస్.జగన్మోహన్‌రెడ్డి అడుగులు వేస్తున్నారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నింటిని అమలులోకి తెచ్చారు. చెప్పినవన్నీ చేశాం... అని రేపు స్థానిక ఎన్నికలలో ప్రజల ముందుకు వెళ్ళి ఓటడగబోతున్నారు.

పంచాయితీ, జడ్పీ, మున్సిపల్... ఒకటి తర్వాత ఒకటి అన్ని ఎన్నికలను కూడా రెండు నెలల్లోనే పూర్తి చేసే దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయి.

జిల్లాలో చూస్తే స్థానిక సంస్థల ఎన్నికల కోసం ఇరు పార్టీలలో నాయకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. జిల్లాలో 900 దాకా పంచాయితీలున్నాయి. రెండేళ్ళ క్రితమే వీటి పదవీకాలం పూర్తయ్యింది. ప్రస్తుతం అవి ఇన్‌ఛార్జ్‌ల పాలనలో వున్నాయి. పంచాయితీ ఎన్నికల్లో పార్టీల ప్రభావం పెద్దగా వుండదు. గ్రామాలలో వర్గాలు, నాయకత్వాన్ని బట్టే పంచాయితీల ఫలితాలుంటుంటాయి. ఇక ఒక కార్పొరేషన్, 6 మున్సిపాల్టీలు, 46 జడ్పీటీసీలు, 46 ఎంపిపిలు, 587 ఎంపిటిసీలకు కూడా ఎన్నికలు జరగాలి. అలాగే కార్పొరేషన్ డివిజన్‌లు, వార్డు కౌన్సిలర్ పదవులు కూడా చాలానేవున్నాయి. ఈ స్థానిక సంస్థల జాతర తొందరగా పూర్తయితే జిల్లాలో రాజకీయ నిరుద్యోగం కొంతన్నా తగ్గుతుంది.

## 'ఇంటర్ సిటీ' పేరు.. 'చంద్రయాన్ ఎక్స్‌ప్రెస్' అని పెడితే...



ఇటీవల గూడూరు-విజయవాడల మధ్య ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌ను ఉపరాష్ట్రపతి యం.వెంకయ్యనాయుడు చేతులమీదుగా ప్రారంభించుకున్నాం. ఎంతో అధునాతనంగా వున్న ఈ రైలుకు క్రమంగా ప్రయాణీకులు పెరుగుతున్నారు. చాలావరకు రైళ్ళకు నెంబర్‌లతో పాటు పేర్లు కూడా వుంటాయి. విజయవాడ - చెన్నైల మధ్య తిరిగే ఎక్స్‌ప్రెస్‌కు పినాకిని ఎక్స్‌ప్రెస్ అని, గూడూరు - సికింద్రాబాద్‌ల మధ్య వేసిన రైలుకు 'సింహపురి ఎక్స్‌ప్రెస్' అని నెల్లూరుజిల్లాతో సంబంధముండే పేర్లను పెట్టడం తెలిసిందే!

అలాగే ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌కు కూడా తల్పగిరి, వేదగిరి, షార్ అనే పేర్లను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే వీటికంటే కూడా ఈ ట్రైన్‌కు 'చంద్రయాన్ ఎక్స్‌ప్రెస్' అని పేరు పెడితే బాగుంటుంది. చంద్రయాన్‌కు నెల్లూరుజిల్లాకు, ఈ రైలుకు సంబంధముంది. చంద్రయాన్ పయనం మొదలుపెట్టింది నెల్లూరుజిల్లా శ్రీహరికోటలోని షార్ సెంటర్ నుండే! చంద్రయాన్ చంద్రుడి వైపు సాగిపోతున్న టైంలోనే గూడూరులో ఈ రైలును ప్రారంభించుకున్నాం. ఇదో చారిత్రాత్మక ఘట్టం.

చంద్రయాన్-2 ప్రయోగంలో చివరిక్షణంలో స్వల్ప అవాంతరం ఎదురైనా దేశం మొత్తం స్ఫూర్తి నింపిన ప్రయోగమిది. చంద్రయాన్ అనే పేరే జాతిని ఏకం చేసింది. భవిష్యత్‌లో ఇంకా ఎన్నో కొత్త రైళ్ళు వస్తాయి. మిగతా పేర్లను వాటికి పెట్టొచ్చు. కాలానుగుణంగా ప్రవేశపెట్టబడిన ట్రైన్ కాబట్టి ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్‌కు 'చంద్రయాన్ ఎక్స్‌ప్రెస్' అని పేరు పెడితే బాగుంటుంది.




19వ వర్ధంతి

కీ॥శే॥ శ్రీ జక్కా రంగారెడ్డి

(మరణం - 18.09.2000)

మహనీయుని దివ్యస్మృతికి మా భాష్పాంజలి

భార్య

జక్కా కామేశ్వరమ్మ

కుమారులు

జక్కా కోదండరామిరెడ్డి

జక్కా శ్రీనివాసులురెడ్డి

జక్కా శివనారాయణరెడ్డి

మరియు

కుటుంబసభ్యులు




## జ్వరం వణికిస్తోంది

సీజన్ మారినప్పుడల్లా నెల్లూరును విషజ్వరాలు వణికిస్తుంటాయి. ఇది ప్రతి ఏడాది వస్తున్న ఆనవాయితీనే! మొన్నటిదాకా ఎండలు మండి పోవడం, ఇటీవల కొద్దిపాటి వర్షాలు కురవడంతో వాతావరణం మారింది. ఎండాకాలంలో మాడి మసైపోయాయనుకున్న లోపలే నాలుగు చినుకులు పడగానే మళ్ళీ విజృంభించాయి. ఈరోజు నగరం నిండా ముదురుదోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. ఈ దోమల దెబ్బకు విషజ్వరాలు విజృంభిస్తున్నాయి.

విషజ్వర పీడితులతో నగరంలోని ప్రైవేట్, ప్రభుత్వ ఆసుపత్రులన్నీ కిటకిటలాడుతున్నాయి. లేబరేటరీలు కూడా రక్తపరీక్షలు చేయించుకునే రోగులతో రద్దీగా వుంటున్నాయి. విషజ్వరాలు మరింతగా ముదరకుండా వైద్యఆరోగ్యశాఖాధికారులు ప్రజలకు అవగాహనా కార్యక్రమాలు చేపట్టాల్సివుంది.

### పనులు ఆపినచోటే..

## ఉద్యమాలు!



విలేకర్లతో మాట్లాడుతున్న శీనయ్య, పక్కన అజీజ్

వైసిపి ప్రభుత్వానికి వందరోజుల టైం ఇచ్చాం.. ఈ వందరోజుల్లో నెల్లూరు నగరంలో వాళ్ళు ఒక్క పని కూడా చేపట్టలేదు. తెలుగుదేశం ప్రభుత్వంలో మొదలుపెట్టిన పనులు దాదాపు పూర్తి కావచ్చాయి. వైసిపి ప్రభుత్వం ఈ వందరోజుల్లో ఆ కొంత శాతం పనులను పూర్తి చేసుంటే నగర ప్రజలకు ఎంతగానో ఉపయోగపడేవి. కాని, వాళ్ళు ఆ పనులు పూర్తి చేయకుండా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. కాబట్టి ఎక్కడైతే పనులు ఆగిపోయాయో అక్కడే ఉద్యమాలు మొదలుపెడతామని నెల్లూరు నగర తెలుగుదేశం నాయకులు హెచ్చరిస్తున్నారు. 8వ తేదీ నెల్లూరులోని టిడిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీమేయర్ అబ్దుల్ అజీజ్, నుడా మాజీ ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, టిడిపి నాయకులు సిహెచ్ హరిబాబుయాదవ్, పిట్టి సత్యనాగేశ్వరరావు, ఎస్.కె.ఖాజావలి, ధర్మవరం సుబ్బారావు, మేకల రామ్మూర్తి, అంచూరు శ్రీనివాస నాయుడు తదితరులు పాల్గొన్నారు. తెలుగుదేశం ప్రభుత్వంలో భూగర్భడ్రైనేజీ, తాగునీటి పైప్‌లైన్‌లు, పార్క్‌లు, నెక్లస్‌రోడ్డు వంటి పనులు దాదాపు పూర్తి చేశాం. మిగిలిన పనులను వైసిపి ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోంది. ఈ వందరోజులలోనే వైసిపి పాలనపై ప్రజలకు విసుగుపుట్టింది. ఇప్పుడు వైసిపి ప్రభుత్వాన్ని ప్రతిపక్షం కంటే ప్రజలే ఎక్కువుగా విమర్శిస్తున్నారని వారు పేర్కొన్నారు. చంద్రబాబు హయాంలో రాష్ట్రాభివృద్ధి మూడు పువ్వులు ఆరు కాయలు అన్నట్లుగా వుంటే, వైసిపి వచ్చి ఆ అభివృద్ధిని ముక్కచెక్కలు చేసిందంటూ టిడిపి నాయకులు వాపోయారు.

### జొన్నవాడ రోడ్డులో...

## మళ్ళీ నరకయాతన!




నగరంలోని వెంకటేశ్వరపురం వద్దనున్న 'టి' టైప్ బ్రిడ్జిలో బుచ్చిరెడ్డిపాలెం వైపు వెళ్లే మార్గం కుంగడంతో ఈ మార్గంలో ఆ రూట్లో వెళ్లే, అటు నుండి నెల్లూరు వచ్చే బస్సులను దారి మళ్లించారు. బుచ్చి వైపు వెళ్లే లేదా వచ్చే బస్సులన్నింటిని కూడా జొన్నవాడ రోడ్డు వైపు మళ్లించారు. బుచ్చి, ఆత్మకూరు, పామూరు, కడప, అనంతపురం, కర్నూలులవైపు వెళ్లే బస్సులన్నీ కూడా ఇప్పుడు ఈ మార్గంలో పయనిస్తున్నాయి. నెల్లూరు ఆర్టీసీ ప్రధాన బస్టాండ్ నుండి బయలుదేరే బస్సులు ఆత్మకూరు బస్టాండ్‌కు చేరుకుని అక్కడ నుండి బోసుబొమ్మ, సంతపేటల మీదుగా జొన్నవాడ రోడ్డులో వెళుతున్నాయి. ఈ మార్గంలో బస్సుల రద్దీ ఎక్కువ కావడంతో ఇరుకళలమ్మ దేవాలయం మలుపు వద్ద తరుచూ ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. దీనికితోడు ఈ రోడ్డులో ఇప్పుడు ఇసుక ట్రాక్టర్లు కూడా స్వైరవిహారం చేస్తున్నాయి. ట్రాఫిక్ విపరీతంగా పెరిగింది. వెంకటేశ్వరపురం బ్రిడ్జిని తొందరగా మరమ్మత్తులు చేసి బస్సులను వదిలితేగాని జొన్నవాడ రోడ్డులో ట్రాఫిక్ కష్టాలు తీరవు.

### రవాణా శాఖలో..

## పదోన్నతులు

రవాణా శాఖలో పలువురు అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లకు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లుగా పదోన్నతులు కల్పించి వారిని ప్రభుత్వం బదిలీ చేసింది. గూడూరులో అసిస్టెంట్ మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న భాస్కరరావును ఎంవీఐగా నెల్లూరుకు బదిలీ చేసారు. ఏఎమ్వీఐగా గూడూరులో పనిచేస్తున్న అనిల్‌కుమార్‌ను మాచర్ల ఎమ్వీఐగా, తెనాలిలో ఏమ్వీఐగా పనిచేస్తున్న బాలకృష్ణను నెల్లూరు ఎమ్వీఐగా, నరసరావుపేటలో ఏఎమ్వీఐగా పనిచేస్తున్న రాఘవరావును గూడూరు ఎమ్వీఐగా నియమించారు.

### నెల్లూరు అర్బన్

## తహశీల్దార్‌గా వెంకటేశ్వర్లు

నెల్లూరు అర్బన్ తహశీల్దార్‌గా వెంకటేశ్వర్లు, వెంకటాచలం తహశీల్దార్‌గా సూర్యనారాయణసింగ్‌ను నియమిస్తూ జిల్లా కలెక్టర్ యంవి శేషగిరిబాబు ఈనెల 10న ఉత్తర్వులు జారీ చేశారు. వెంకటేశ్వర్లు జిల్లా కలెక్టరేట్‌లో పరిపాలనాధికారిగా ఉంటూ ఇటీవల సెలవులో వున్నాడు. ఇప్పుడు ఆయన్ను తిరిగి పాత పోస్టులో నియమించకుండా నెల్లూరు అర్బన్ తహశీల్దార్‌గా నియమించారు.

### ఉపాధ్యాయులకు

## ఫ్రెండ్స్ వాకర్స్ సత్కారం



భారతరత్న, మాజీ భారత రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ 131వ జయంతిని పురస్కరించుకుని ఈనెల 5 న నెల్లూరు ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఫ్రెండ్స్ వాకర్స్ అధ్యక్షులు నలుబోలు బలరామయ్య నాయుడు ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 15 మంది ఉపాధ్యాయులను తగిన రీతిలో సత్కరించి మిఠాయిలు, బిస్కెట్లు పంపిణీ చేసారు. అసోసియేషన్ సభ్యులు కొండూరు సుబ్బారావు, జీవీ కృష్ణయ్య, లక్కాకుల శ్రీనివాసులు, వీరిశెట్టి హజరత్‌బాబు, మాగంటి ప్రసాద్, డి.జయరామానాయుడు, కె.మధుసూదనరావు, కె.రమేష్, డి.దేవదానం, ఆర్.సుబ్బారావు, కెబి భాస్కరరావు, మనోజ్, ఏవి సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

### శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో...

## స్తంభప్రతిష్ట



శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో ఈనెల 28 నుంచి వచ్చే అక్టోబర్ 8వ తేది వరకు ఎంతో వైభవంగా జరుగనున్న శరన్నవరాత్రి ఉత్సవాలకు ఈ నెల 8న భక్తిశ్రద్ధలతో స్తంభప్రతిష్ట చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు తంగిరాల రాధాకృష్ణ శర్మ ఆధ్వర్యంలో గణపతిపూజ, నవగ్రహారాధన, పుణ్యాహవచనం తదితర పూజలు శాస్త్రోక్తంగా జరిగాయి. ఈ వేడుకలో వైఎస్సార్సీపి రూరల్ కార్యాలయం ఇన్‌చార్జి కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, డివిజన్ ఇన్‌చార్జి మదన్‌మోహన్‌రెడ్డి, శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సన్నపరెడ్డి పెంచలరెడ్డి, వైసిపి నాయకులు బొబ్బల శ్రీనివాసయాదవ్, దేవస్థాన వ్యవస్థాపక వంశపారంపర్య ధర్మకర్త రత్నం జయరామ్, ఆలయ అధికారి వెండిదండి శ్రీనివాసరెడ్డి, అర్చకులు రఘునాథశర్మ, రవిస్వామి, రామకృష్ణమాచార్యులు, ఆలయసిబ్బంది పాల్గొన్నారు.

## 'ఇస్కాన్'లో రాధాష్టమి



నెల్లూరులోని ఇస్కాన్ మందిరంలో ఈ నెల6వ తేది రాత్రి కన్నులపండువంగా రాధాష్టమి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మందిరంలో కొలువైవున్న మూలవర్లకు శోభాయమానంగా అలంకారాలు నిర్వహించి అభిషేకసేవలు చేసి హారతులిచ్చారు. ఇస్కాన్ అధ్యక్షుడు శుకదేవస్వామి ఆధ్వర్యంలో ఈ వేడుక జరిగింది. పెద్దసంఖ్యలో భక్తులు ఈ కార్యక్రమాల్లో పాల్గొని స్వామివార్లను దర్శించుకున్నారు. అనంతరం మందిరం నిర్వాహకులు భక్తులందరికీ అన్నప్రసాద వితరణ చేశారు.



### ఆకర్షణగా..

## ఆకాశంలో చక్కర్లు

నెల్లూరులో తొలిసారిగా రొట్టెల పండుగ నేపథ్యంలో పారాగ్లైడింగ్ ఏర్పాటు చేశారు. ఏసి స్టేడియంలో దీనిని అనుభవజ్ఞులైన నిపుణుల పర్యవేక్షణలో ఏర్పాటు చేశారు. పారాగ్లైడింగ్ ద్వారా పలువురు ఆకాశంలో చక్కర్లు కొడుతూ నెల్లూరు నగర అందాలను వీక్షించారు. ఆకాశంలో చిన్నసైజు హెలికాఫ్టర్‌లాగా పారా గ్లైడింగ్ తిరుగుతుంటే పౌరులు ఆసక్తిగా వీక్షించారు.

### మహ్మద్ రఫి

## మ్యూజికల్ నైట్

దివంగత మహా గాయకుడు మహ్మద్ రఫి వర్థంతి సందర్భంగా ఈ నెల 15వ తేదీ ఆదివారం రాత్రి నెల్లూరు, కెవిఆర్ పెట్రోల్ బంకు సెంటర్‌లోని కస్తూరిదేవి గార్డెన్స్‌లో యాదే రఫి మ్యూజికల్ నైట్‌ను నిర్వహిస్తున్నారు. గత కొన్నేళ్లుగా రఫి మీద వున్న అభిమానంతో మహ్మద్ రఫి కల్చరల్ అకాడమీ అధ్యక్షుడు జాకీర్‌హుస్సేన్ ఈ పాటల వేడుక జరుపుతున్నారు. ఈనెల 15వ తేదీ రాత్రి 7గంటలకు ఈ వేడుక ప్రారంభమవుతుందని, రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సహకారంతో ఈ స్వరసంబరాన్ని నిర్వహిస్తున్నామని జాకీర్ హుస్సేన్ తెలిపారు.

## ఇన్‌చార్జి జేసీ-2గా డీఆర్వో

నెల్లూరు జిల్లా జాయింట్ కలెక్టర్-2 ఇన్‌చార్జిగా డీఆర్వో డి. మల్లిఖార్జునను నియమిస్తూ జిల్లా కలెక్టర్ యంవి. శేషగిరిబాబు ఈనెల 7 న ఉత్తర్వులు జారీ చేశారు. జేసీ-2 గా పనిచేస్తున్న కేఈ సాధన ఇటీవల బదిలీపై రాష్ట్ర భూపరిపాలనా విభాగం (సీసీయల్‌ఏ) కమీషనరేట్ కార్యాలయానికి వెళ్ళారు. కొత్త జేసీ-2 వచ్చే వరకు డీఆర్వోకు ఆ బాధ్యతలు అప్పగించారు.

### రక్తదానమంటే..

## ప్రాణదానమే

రక్తదానం చేయడమంటే ప్రాణదానం చేసినట్లేనని, ప్రాణాపాయస్థితిలో ఉన్నవారి ప్రాణాలను నిలిపేందుకు ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని డాక్టర్ శివకుమార్ కోరారు. అంతర్జాతీయ ఫిజియోథెరపీ దినోత్సవాన్ని పురస్కరించుకుని నెల్లూరులోని ఫిజియోథెరపీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 8న నెల్లూరు, కరెంటాఫీస్ సెంటర్‌లోని నిస్సీ ఫిజియోథెరపీ సెంటర్‌లో అసోసియేషన్ డాక్టర్లు మెగా రక్తదానశిబిరాన్ని నిర్వహించగా, అసోసియేషన్ సభ్యులు సుమారు వందమందికి పైగా పాల్గొని రక్తదానం చేశారు. అనంతరం రిత్విక్ లేఅవుట్, బీవినగర్ తదితర ప్రాంతాల్లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ శివకుమార్ మాట్లాడుతూ రక్తదానం విశిష్టతను వివరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు అజయ్‌కుమార్, వినయ్‌కుమార్, శ్రీకర్, హరిబాబు, సుబ్బయ్య, రాకేష్, శ్రావణ్, వంశీ తదితరులు పాల్గొన్నారు.



## ఆదాల ప్రయత్నంలో...
# ఓ ముందడుగు

బిట్రగుంట రైల్వే అభివృద్ధి కోసం నానా తంటాలు పడుతున్న నెల్లూరు పార్లమెంటు సభ్యులు ఆదాల ప్రభాకర్‌రెడ్డి ప్రయత్నాలు చిగురించే అవకాశాలు కనపడుతున్నాయి. ఆదాల ఎంపీగా బాధ్యతలు చేపట్టాక గత మూడు నెలల్లో బిట్రగుంటలో రైల్వే అభివృద్ధి కోసం పూర్తిస్థాయిలో దృష్టిపెట్టారు. దీని కోసం పార్లమెంటులో మాట్లాడాడు. రైల్వేమంత్రిని ఒకటికి రెండుసార్లు కలిశాడు. ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు దృష్టికి కూడా ఈ విషయాన్ని తీసుకెళ్లాడు. బిట్రగుంటలో రైల్వేకు 1100 ఎకరాల భూమి వుంది. రైల్వేపరంగా ఏ పరిశ్రమనైనా పెట్టొచ్చు. కొత్తగా భూసేకరణ అవసరంలేదు.

గతంలో ఇక్కడ రైల్వే కాంక్రీట్ స్లీపర్ కోచ్ ఫ్యాక్టరీకి శంకుస్థాపన జరిగినా పని జరగలేదు. శిలాఫలకం మాత్రం అలాగే వుంది. ఇప్పుడు బిట్రగుంట రైల్వే అభివృద్ధిపై ఆదాల గట్టి పట్టుపట్టాడు. ఎట్టకేలకు రైల్వేమంత్రి పీయుష్ గోయెల్ నుండి దీనిపై సానుకూల సందేశాలు అందాయి. బిట్రగుంటలో కాంక్రీట్ స్లీపర్ కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తామనే హామీ ఆయన ఇచ్చినట్లుగా తెలుస్తోంది. పీయూష్‌గోయెల్ హామీ ఇచ్చాడంటే... అది ఆచరణలోకి వచ్చినట్లే!

# టీడీపీ నుండి వైసిపి వైపు పరుగులు

ఎన్నికలకు ముందు ఆరునెలలు, ఎన్నికల తర్వాత ఒక సంవత్సరం పాటు రాజకీయ నాయకులకు పార్టీలు మారే సీజన్. ఎన్నికలకు ముందు ఇరువైపుల నుండి జంపింగ్‌లుంటాయి. అధికారంలో వున్న పార్టీ మీద అసంతృప్తి చెందిన వాళ్ళు, తానుంటున్న పార్టీ మళ్ళీ అధికారంలోకి రావడం కష్టమని భావించిన వాళ్ళు, లేదా వుంటున్న పార్టీలో సీటు రానివాళ్ళు అవతల పార్టీలోకి వెళుతుంటారు. అదే సమయంలో ప్రతిపక్షంలో నుండి కూడా అధికార పక్షంలోకి నాయకుల జంపింగ్‌లుంటాయి.

అయితే ఎన్నికల తర్వాత మాత్రం ప్రతిపక్షాలలో నుండి అధికారపక్షంలోకి మాత్రమే జంపింగ్‌లుంటాయి. ఎన్నికలను నాలుగున్నరేళ్ళ దూరంలో పెట్టుకుని ఏ నాయకుడు కూడా ప్రతిపక్ష పార్టీలో చేరే సాహసం చేయడు. ఇంకా ప్రతిపక్షం నుండి అధికారపక్షంలోకే వలసలు ఎక్కువుగా



వుంటాయి. నెల్లూరుజిల్లా వరకు చూస్తే మిగిలిన నియోజకవర్గాలలో లేవుగాని, నెల్లూరు గ్రామీణ నియోజకవర్గంలో మాత్రం తెలుగుదేశం నుండి వైసిపిలోకి వలసలు జోరందుకున్నాయి. గత ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ కోసం పనిచేసిన నాయకులు, మాజీ కార్పొరేటర్లు ఇటీవల బాగానే వైసిపిలో చేరుతున్నారు. ఇలా చేరుతున్న వాళ్లలో 2014 ఎన్నికల తర్వాత వైసిపి నుండి తెలుగుదేశంలోకి వెళ్లిన వాళ్ళు కూడా వున్నారు. ఇంకా కొందరు నాయకులు టిడిపి నుండి వైసిపిలో చేరడానికి సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

వీళ్ళు చేరడం బాగానే వుందిగాని, వీళ్ల చేరిన తర్వాత గత పదేళ్లు పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తలకు ఇబ్బంది రాకుండా చూసుకోవడం చాలా ముఖ్యమైన అంశం. త్వరలో కార్పొరేషన్ ఎన్నికలు, పంచాయితీ, జడ్పీటీసీ ఎన్నికలు రాబోతున్నాయి. టిక్కెట్ల విషయంలో పాత, కొత్త అనే తేడా వుండదు, అందరూ ప్రయత్నించే వాళ్ళే. కాబట్టి సమన్వయంతో వైసిపి కేడర్‌ను ఎన్నికలకు సన్నద్ధం చేయాల్సి వుంటుంది.

## సోమశిల నుండి...
# కండలేరుకు కదిలిన నీళ్ళు

**• పూజలు చేసి వదిలిన మంత్రులు**

ఈ నెల 10వ తేదీన సోమశిల నుండి కండలేరు జలాశయానికి నీళ్ళను విడుదల చేశారు. రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి పి.అనిల్‌కుమార్‌యాదవ్, రాష్ట్ర ఐ.టి పరిశ్రమల శాఖ మంత్రి మేకపాటి గౌతంరెడ్డిలు జలాశయం వద్ద గంగమ్మకు పూజలు నిర్వహించి, సాంప్రదాయ బద్ధంగా సారెను వదిలి గేట్లు తెరిచారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కిలివేటి సంజీవయ్య, వి.వరప్రసాద్, కలెక్టర్ ఎం.వి.శేషగిరిబాబు, ఇరిగేషన్ సి.ఇ మురళీధర్‌రెడ్డి, ఎస్.ఇ నాగుల్‌మీరా, సోమశిల ఇ.ఇ. సురేష్‌బాబు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి అనిల్ మాట్లాడుతూ సోమశిలకు ఇప్పటికే 30 టీఎంసీల నీళ్ళు వచ్చాయని, ఇంకా కూడా వస్తాయని, ఈ ఏడాది జిల్లాలో నీళ్ళకు ఇబ్బందులు లేకుండా చేస్తామన్నారు. జిల్లాలోని అన్ని చెరువులను నీటితో నింపుతామన్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వంలో కంటే కూడా ఒక్క టిఎంసి నీళ్ళనైనా జిల్లాకు అదనంగా తెస్తామని అనిల్ పేర్కొన్నాడు. 2022కల్లా రాష్ట్రంలో పెండింగ్‌లో వున్న అన్ని ఇరిగేషన్ ప్రాజెక్టులను పూర్తి చేయడం జరుగుతుందని, వరద తగ్గిన వెంటనే పోలవరం ప్రాజెక్ట్ పనులను మొదలుపెట్టడం జరుగుతుందని ఆయన వెల్లడించాడు. మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి మాట్లాడుతూ ఈ ఏడాది చివరి ఆయకట్టు వరకు మొదటి పంటకు నీళ్లిస్తామని హామీ ఇచ్చాడు. అనిల్ జలవనరుల శాఖ మంత్రి పదవిని చేపట్టిన వేళా విశేషం బాగుందని, ఆయన మంత్రి కాగానే రాష్ట్రంలోని ప్రాజెక్టులన్నీ కళకళలాడుతున్నాయని అన్నాడు.



గంగమ్మకు సారెలు వదులుతున్న మంత్రులు గౌతమ్‌రెడ్డి, అనిల్‌కుమార్‌యాదవ్

## ఇచ్చిన మాట..
# నిలబెట్టుకున్న ముఖ్యమంత్రి

**- రామ్‌కుమార్ హర్షం**



రాష్ట్ర ముఖ్యమంత్రి డా.వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారని, సిఎంగా బాధ్యతలు చేపట్టిన మూడు నెలల కాలంలోనే టిడిపి హయాంలో చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ తొలి విడత బకాయిలను ప్రభుత్వం విడుదల చేయడం హర్షదాయకమని ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (అపెక్మా) గౌరవసలహాదారు, వైఎస్‌ఆర్‌సిపి సీనియర్ నాయకుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో హర్షం వెలిబుచ్చారు. 2018-19 విద్యా సంవత్సరానికి ఇంజనీరింగ్, డిగ్రీ, తదితర కోర్సులకు సంబంధించి గత ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలను విడుదల చేయాలంటూ తమ అసోసియేషన్ విజ్ఞప్తిచేసిందని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి తాజాగా ఆ మొదటి విడత బకాయిలను విడుదల చేయడం వల్ల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం ఎంతగానో ప్రోత్సాహాన్ని అందించినట్లయిందని రామ్ సంతోషం వ్యక్తం చేశారు.

# 29న రెడ్‌క్రాస్ సంస్థ సర్వసభ్య సమావేశం

నెల్లూరు జిల్లా రెడ్‌క్రాస్ సంస్థ జీవిత సర్వసభ్య సమావేశాన్ని జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు మేరకు ఈనెల 29న ఉదయం 11గంటలకు నెల్లూరు కస్తూర్బా కళాక్షేత్రంలో నిర్వహిస్తున్నట్లు రెడ్ క్రాస్ అడ్ హక్ కమిటీ ఛైర్మన్ ఏవీ సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ సమావేశానికి జీవిత సభ్యులందరూ రెడ్‌క్రాస్ జీవిత సభ్యత్వ గుర్తింపు కార్డును తీసుకురావలసిందిగా కోరారు.


అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు


# 'పరీక్ష'ను అధిగమించారు

**- అధికారులకు కలెక్టర్ ప్రశంస**

జిల్లాలో సచివాలయ పరీక్షలను ఎటువంటి ఆరోపణలు రాకుండా నిర్వహించడంలో జిల్లా అధికార యంత్రాంగం విజయవంతమైంది. ఈ నెల 1వ తేదీ నుండి 8వ తేదీ వరకు గ్రామ సచివాలయ పరీక్షలను నిర్వహించడం తెలిసిందే! 1.29 లక్షల మంది ఈ పరీక్షను వ్రాయడానికి దరఖాస్తు చేసుకోగా, 1.17 లక్షల మంది పరీక్షలకు హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా 483 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రాలను 89 రూట్లుగా ఏర్పాటు చేసి 120 ఫ్లయింగ్ స్క్వాడ్‌లను తిప్పారు. జిల్లాలోని పది ఆర్టీసీ డిపోల నుండి కూడా వివిధ రూట్లలో పరీక్షలు వ్రాసే అభ్యర్థుల కోసం ప్రత్యేక బస్సులు నడిపారు. మున్సిపల్ శాఖ కమిషనర్ విజయకుమార్ నెల్లూరులో పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు.

చరిత్రలోనే అత్యధిక ఉద్యోగాలకు అత్యధిక సంఖ్యలో అభ్యర్థులు హాజరైన పరీక్షలను విజయవంతంగా నిర్వహించడానికి జిల్లాలోని వివిధ శాఖల అధికారులు, సిబ్బంది ఎంతో కృషి చేశారని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎం.వి.శేషగిరిబాబు పేర్కొన్నారు. పరీక్షల నిర్వహణలో పాలుపంచుకుని విజయవంతం చేసిన పలువురు అధికారులను ఆయన 10వ తేదీ నెల్లూరుజిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రత్యేకంగా సత్కరించారు.






## జాతర...
# జాగ్రత్తగా జరుపుదాం!

**- ఎమ్మెల్యే ఆనం**



ఈ నెల 18, 19 తేదీలలో నిర్వహించే వెంకటగిరి పోలేరమ్మ జాతరను ప్రశాంతంగా, భక్తి శ్రద్ధలతో జరుపుకుందామని వెంకటగిరి శాసనసభ్యులు ఆనం రామనారాయణరెడ్డి పిలుపు నిచ్చారు. 9వ తేదీ వెంకటగిరి లోని పింజల వీరయ్య కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన శాంతి సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ జాతర నిర్వహణలో ప్రతిఒక్కరం భాగస్వాములం కావాలని, అమ్మవారి దర్శనం కోసం వివిధ ప్రాంతాల నుండి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. 1914 నుండి ఏ ఆచారవ్యవహారాల ప్రకారం జాతరను నిర్వహిస్తున్నారో అదే విధంగా ఈ ఏడాది కూడా జాతరను నిర్వహించాలని ఆయన దేవాదాయ శాఖ అధికారులను ఆదేశించారు. జాతరలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు తగిన భద్రతా చర్యలు చేపట్టాలన్నారు. పారిశుధ్యం, మంచినీళ్ళు, మరుగుదొడ్ల నిర్వహణకు ఎమ్మెల్యే గ్రాంటు నుండి 10 లక్షలు, ఎల్ఇడి లైట్ల కోసం 22.5 లక్షలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో గూడూరు సబ్‌కలెక్టర్ రాజశేఖర్, మాజీమున్సిపల్ ఛైర్‌పర్సన్ దొంతు శారద, దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ ఏ.సి రవీంద్రరెడ్డి, వైసిపి నాయకులు కలిమిలి రాంప్రసాద్‌రెడ్డి, జి.ఢిల్లీబాబు, నక్కా ఆనంద్‌బాబు, గిరిరెడ్డి, కొండూరు వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

# గ్రూపులు కడితే సహించేది లేదు

**- బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్యమూర్తి**



పార్టీలోకి వచ్చే కొత్తవారిని కూడా కలుపుకుని పార్టీని మరింత పటిష్టవంతం చేయాలని, పార్టీలో గ్రూపులు కడితే సహించేది లేదని, అందరినీ కలుపుకుని పోవాలే తప్ప వర్గరాజకీయాలు చేయ కూడదని బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్యమూర్తి స్పష్టం చేశారు.

నెల్లూరు రామ్మూర్తినగర్‌లోని బాల పీరయ్య కల్యాణమండపంలో ఈనెల 8న ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోడీ పాలనకు మెచ్చి దేశవ్యాప్తంగా ఎంతోమంది బిజెపిలో చేరుతున్నారన్నారు. రాష్ట్రంలో బిజెపి సభ్యత్వ నమోదులో నెల్లూరుజిల్లా ముందుండేలా కృషి చేసిన వారందరినీ ఆయన ఈ సందర్భంగా అభినందించారు. పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేసేందుకు కృషిచేయాలన్నారు. ప్రధాని నరేంద్రమోడీ జన్మదినాన్ని పురస్కరించుకుని ఈనెల 14 నుంచి 20వతేదీ వరకు దేశవ్యాప్తంగా సేవాసప్తాహం పేరుతో పలు ఆశ్రమాల్లో సేవ కార్యక్రమా లతో పాటు రక్తదానశిబిరాలను కూడా నిర్వహించనున్నారని ఆయన తెలిపారు. ఈనెల 11 నుంచి 30వతేదీలోపు బూత్‌స్థాయి కమిటీలకు, వచ్చేనెల 11 నుంచి 30వతేదీలోపు మండల స్థాయిలో పార్టీ పరంగా ఎన్నికలను నిర్వహించా లని ఆయన అన్నారు. ఈ సందర్భంగా నెల్లూరు రామ్మూర్తినగర్ హౌసింగ్ అసోసియేషన్ కార్యదర్శి శ్రీకంఠం రమణయ్య, నరేంద్ర, గోపాల్‌రెడ్డి, వెంకురెడ్డి, సంగం మండలానికి చెందిన టిడిపి నాయకుడు కొండారెడ్డి, ఆయన అనుచరులు, అన్నారెడ్డిపాళెం గ్రామానికి చెందిన రవి, వెంకట సుబ్బయ్య తదితరులు బిజెపిలో చేరగా, వారిని ఆయన స్వాగతించారు. బిజెపి జిల్లా అధ్యక్షుడు సురేంద్రరెడ్డి, జిల్లా ఇన్‌ఛార్జి సైదారెడ్డి, రాష్ట్ర అధికారప్రతినిధి కర్నాటి ఆంజనేయరెడ్డి, నర సింహానాయుడు, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## 'సేవా సప్తాహం' కన్వీనర్‌గా మిడతల రమేష్



బిజెపి సేవా సప్తాహం జిల్లా కన్వీనర్‌గా ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మిడతల రమేష్ నియమితులయ్యారు. ఆ మేరకు పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్యమూర్తి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రధాని నరేంద్రమోడీ జన్మదినాన్ని పురస్కరించుకుని ఈ నెల 14 నుంచి 20వ తేది వరకు 'సేవా సప్తాహం' పేరుతో సేవా కార్యక్రమాలను నిర్వహించాలని ఆయన పేర్కొన్నారు.

## బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాసరెడ్డి

నెల్లూరు జిల్లా అటవీ అధికారిగా వై.శ్రీనివాసరెడ్డి ఈనెల 9న జిల్లా అటవీశాఖ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. కడప జిల్లాకు చెందిన శ్రీనివాసరెడ్డి విజయవాడలోని అటవీశాఖ చీఫ్ కన్జర్వేటర్ కార్యాలయంలో పరిశోధన విభాగంలో డిప్యూటి కన్జర్వేటర్‌గా పనిచేస్తూ డీఎఫ్‌వోగా జిల్లాకు వచ్చారు. ఇక్కడ డీఎఫ్‌వోగా పనిచేస్తున్న సి.వేణుగోపాల్ నర్సీపట్నం బదిలీ అయ్యారు.

# గూడూరు డివిజన్ వార్తలు

## జేవివి సేవలు అభినందనీయం

**- ఎమ్మెల్యే వరప్రసాదరావు**



గర్భిణులకు పోషకాహారాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే వరప్రసాదరావు, డాక్టర్ రాజేంద్రప్రసాద్ తదితరులు

ప్రజలను ఉత్తమజీవనం వైపు నడిపించడంలో జేవివి చేస్తున్న కృషి అభినందనీయమని గూడూరు ఎమ్మెల్యే వరప్రసాదరావు అన్నారు. గూడూరులోని ప్రాంతీయ ఆసుపత్రిలో ఈనెల 9న జేవివి ఆధ్వర్యంలో గర్భిణులకు పోషకాహార పొట్లాలను ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల్లో మూఢనమ్మ కాలపై చైతన్యం కలిగించడంతో పాటు పలు సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినంద నీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఉమ, సంస్థ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, డాక్టర్ మహేంద్రరెడ్డి, బుజగేంద్రరావు, ఎస్.రామ్మోహన్ రావు, పురుషోత్తం, తాళ్ళూరు శ్రీనివాసులు, చెంచునారాయణ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

## నూరు రోజుల పాలనకు నూరు మార్కులు

**- తిరుపతి ఎంపీ బల్లి దుర్గాప్రసాద్‌రావు**



రాష్ట్ర ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నూరు రోజుల పాలన అద్భుతంగా ఉందని, ప్రజాసంక్షేమ కార్యక్రమాల అమలు అభినందనీయమని తిరుపతి ఎంపీ బల్లి దుర్గాప్రసాద్ రావు కొనియాడారు. గూడూరు రెండవ పట్టణంలోని మాలవ్యా నగర్ ప్రాంతంలో వైకాపా నాయకుడు కోడూరు శ్రీనివాసులురెడ్డి నివాసంలో ఆయన ఈనెల 8న పలువురు పార్టీ నాయకులను కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఎంపీ మాట్లాడుతూ సీఎం జగన్ ప్రజాసంక్షేమం కోసం ఎన్నో సాహసోపేత నిర్ణయాలు తీసుకుంటున్నారని, గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా యువతకు పెద్దఎత్తున ఉద్యోగావ కాశాలు కల్పిస్తున్నారన్నారు. యువతకు ఉపాధి కల్పిస్తామని ఇచ్చిన మాటను జగన్ నిలబెట్టుకుంటున్నారన్నారు. అదేవిధంగా ఎన్నికల్లో మాట ఇచ్చినట్లుగానే ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేశారని, అపరిష్కృతంగా ఉన్న ఎన్నో సమస్యలను పరిష్కరిస్తున్నారన్నారు. అయినప్పటికీ కొందరు కావాలనే సిఎం జగన్‌పై లేనిపోని ఆరోపణలు చేస్తుండడం మంచిపద్ధతి కాదన్నారు. సచివాలయాల ఉద్యోగాల విషయంలో దళారుల మాటలు నమ్మవద్దని, ప్రతిభ ఉన్నవారికే పట్టం కట్టాలని సిఎం స్పష్టంగా అధికారులను ఆదేశించి ఉన్నారని ఎంపీ అన్నారు. ఈ సమావేశంలో వైకాపా నాయకులు డి.విష్ణువర్ధన్‌రెడ్డి, దువ్వూరు వెంకటకృష్ణారెడ్డి, తిరుమూరు సురేష్‌రెడ్డి, వరదారెడ్డి శ్రీధర్‌రెడ్డి, వెంకురెడ్డి, అన్నంరెడ్డి పరంధామరెడ్డి తదితరులు పాల్గొన్నారు. తొలుత ఎంపీ బల్లి దుర్గాప్రసాద్‌రావును వైకాపా నాయకులు స్వాగతం పలికి పూలమాలలతో ఘనంగా సన్మానించారు.

## క్రీడలతో మానసికోల్లాసం



క్రీడల్లో విజేతను అభినందిస్తున్న డిఎస్పీ శ్రీభవాని హర్ష

క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని గూడూరు డిఎస్పీ శ్రీభవాని హర్ష అన్నారు. గూడూరులోని డిఎస్పీ కార్యాలయంలో ఈనెల 8న జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని, జిల్లాస్థాయి విలువిద్య పోటీల్లో విజయం సాధించిన క్రీడాకారులను అభినందించారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ బాగా రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు.

## డిఆర్‌డబ్ల్యు కళాశాలకు జాతీయస్థాయి గుర్తింపు



డా. సిఆర్ రెడ్డి

గూడూరు పట్టణంలోని డిఆర్‌డబ్ల్యు కళాశాలకు జాతీయస్థాయి గుర్తింపు లభించిందని ఆ కళాశాల కరెస్పాండెంట్ డాక్టర్ సిఆర్ రెడ్డి, ప్రిన్సిపాల్ భారతలక్ష్మి తెలియజేశారు.

ఈనెల 9న జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ యుజిసి ఆధ్వర్యంలో కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టినవిధంగా బోధన, మౌలికవసతులు, విద్యార్థుల క్రమశిక్షణ ఆధారంగా ఉత్తమ కళాశాలగా డిఆర్‌డబ్ల్యును ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు.

## ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



ఆనిమెళ్ళ రవికుమార్, ఆయన సతీమణి అనూరాధను సన్మానిస్తున్న మాజీ మండల విద్యాశాఖాధికారి సూర్యనారాయణ

గూడూరు మండలంలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని ఉపాధ్యాయ సంఘాల వారు గురుపూజోత్సవం సందర్భంగా ఈనెల 5న సన్మానించారు. విద్యాశాఖ ప్రకటించిన ఉత్తమ ఉపాధ్యాయులు ఆనిమెళ్ళ రవికుమార్ (మిట్టాత్మకూరు బీసీ పాఠశాల), కె. సత్యనారాయణరావు (చెంబడిపాలెం అప్పర్‌ప్రైమరీ స్కూల్), ఎం.కృష్ణయ్య (నెర్నూరు పాఠశాల), ఎం. విజయలక్ష్మి (చెన్నూరు మెయిన్ పాఠశాల), టి.లక్ష్మీప్రసన్న (కాంద్ర మెయిన్ పాఠశాల), కె. శ్రీహరి (మిట్టాత్మకూరు ఎస్సీ పాఠశాల)లను సన్మానించారు. మండల మాజీ విద్యాశాఖ అధికారి వి.సూర్యనారాయణ, ఎంపిడిఓ నాగమణి, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధుల చేతులమీదుగా వారు సన్మానాలను అందుకున్నారు.

# మనసును హత్తుకునే 'సంగెవేని' కథలు

గ్రంథ సమీక్ష




రచన : సంగెవేని రవీంద్ర
వెల: రూ.150/- పేజీలు: 135
ప్రతులకు:
సి.వి.కాంపౌండ్ 7/4, హనుమాన్ లేన్,
లోయర్ పారెల్, ముంబై - 400 013.
మరియు అన్ని ప్రముఖ పుస్తక విక్రయ కేంద్రాల్లో.

మహారాష్ట్రలో తెలుగువారి చరిత్ర మూడు శతాబ్దాల నాటిది. వంద సంవత్సరాలకు ముందే ముంబయిలో తెలుగు పత్రికలు వెలువడ్డాయి. తెలుగు రచయితలూ ఉన్నారు. అయితే, భాష తెలుగు అయినప్పటికీ లిపి మాత్రం దేవనగరిలో ఉండేది. అప్పట్లో ఎన్నో ప్రత్యేక సంచికలు కూడా వెలువడ్డాయి. ఆమాటకొస్తే కొన్ని శతాబ్దాల కిందటే తెలుగు రాజులు మరాఠాలోని కొంత ప్రాంతాన్ని పాలించారు. అలాగే మరాఠా వారు తెలుగు, తమిళ ప్రాంతాలను కొంతకాలం పాలించారు. ఆ విధంగా మరాఠీ భాషలో ద్రావిడభాషా పదాలు విరివిగా కనిపిస్తాయి. ఇప్పటికీ ఆ సంబంధాలు అలాగే కొనసాగుతున్నాయి. షిర్డీకి వెళ్ళేవారు అత్యధికశాతం తెలుగువారే. మహారాష్ట్రలో ఎందరో కవులు, రచయితలు నేటికీ తెలుగు సాహితీ సృజన గావిస్తున్నారు. అందులో సంగెవేని రవీంద్ర ప్రముఖులు. ఆయన రెండు తెలుగు రాష్ట్రాల్లోనే గాక, మహారాష్ట్రలో కూడా పేరున్న కవి. తెలుగేతర రాష్ట్రాల్లో ఎన్నో సాహితీ కార్యక్రమాలు నిర్వహించారు, పాల్గొన్నారు. పలు అవార్డులు సాధించారు. ఇంతవరకు సంగెవేని రవీంద్ర కవిగా, వ్యాసకర్తగా, పాత్రికేయునిగా, సంపాదకునిగా మాత్రమే అందరికీ తెలుసు. ఈ 'ముంబయి మేరీజాన్' అనే కథా సంపుటితో కథా రచయితగా కూడా తెలుగు పాఠకులకు పరిచయం అవుతున్నారు.

కథ అనేది ఒక ప్రయోజనాత్మకమైన, ప్రయోగాత్మకమైన, సృజనాత్మకమైన ప్రక్రియ. సంగెవేని కథలు వాస్తవానికి దగ్గరగా ఉండి ఆలోచింపజేస్తాయి. పాఠకులపై గాఢముద్రను వేస్తాయి.

'ముంబయి మేరీజాన్'లో 20 కథలున్నాయి. ఇవన్నీ దాదాపు ముంబయి నేపథ్యంలో రచింపబడినవి. కార్పొరేట్ కల్చర్ నుంచి కార్మికుని స్వేదబిందువు వరకు కథలుగా మారాయి. భావోద్వేగాలు, రాగద్వేషాలు, హిపోక్రసీ, శ్రమదోపిడీ, ఆశనిరాశలు, ఎండమావుల వెంట పరుగులు..ఒకటేమిటి ఆధునిక మానవుని జీవితంలోని అన్ని పార్శ్వాలను తడిమినట్లుగా ఈ కథలున్నాయి. 'మరుగుజ్జు' కథలో మతాన్నిబట్టి మనుషుల గుణాలను అంచనా వేయకూడదు. మతాన్ని బట్టి మనసును అంచనా వేయలేం.. అనే విషయాన్ని అక్బర్ పాత్రద్వారా హృద్యంగా రచించారు రచయిత. మత సామరస్యానికి మెచ్చుతునక ఈ కథ. ఈ కథను చదివాక ఒక మంచికథను చదివామన్న సంతృప్తి కలుగుతుంది పాఠకులకి. అదేవిధంగా 'గోడ కూలింది' అనే కథలో సొంత ఇంటి ప్రాధాన్యత, ఆ ఇంటిచుట్టూ అల్లుకున్న స్వాభిమానపు గోడలు, అవి అకస్మాత్తుగా కూలిపోతే కలిగే వేదన ప్రతిబింబిస్తుంది. ముంబయి లాంటి మహానగరంలో సామాన్యుడు మనుగడ సాగించాలంటే సొంతగూడు దొరకడం చాలా కష్టం. ఈ నేపథ్యంలో రాసిన ఆ కథ అందరినీ బాగా ఆకట్టుకుంది.

ఎన్నో కథలు మనం చదువుతూనే ఉంటాం. కానీ, కొన్ని మాత్రమే మనల్ని కుదిపేస్తాయి. చాలాకాలం పాటు వెంటాడుతాయి. ఆ కోవకు చెందిన కథే..'ఓ అక్షరం అస్తమించిన వేళ'..రాఘవయ్య మేస్టారుగారి తెలుగుభాషాభిమానం, తెలుగు వికాసానికి తాను పడే పాట్లు, కథాంతాన్ని వర్ణించిన తీరు అద్భుతంగా ఉంది. ఇలా చెప్పుకుంటూ పోతే ఇందులోని ప్రతికథా ఆణిముత్యమే. సంగెవేని రవీంద్ర తన కథల్లోని పాత్రల ద్వారా.. సమాజంలో పెరుగుతున్న స్వార్థచింతన, మితిమీరిన ధనాపేక్ష, క్షీణించిపోతున్న మానవసంబంధాలు.. వంటి అంశాలెన్నిటినో వివరించాడు. అందులోనూ "సహజంగా, సరళంగా కథ రాయడం ఆయన ప్రత్యేకత... రవీంద్ర కథలన్నీ చదివాక ఆయన చెప్పదలచుకున్నదేదో మనకి స్పష్టంగా తెలిసిపోతుంది. అంతేకాదు, కథల ముగింపులో రాసిన పదాలు మనల్ని ఉలిక్కిపడేలా చేస్తాయి"..అని ప్రముఖ రచయిత్రి తురగా జయశ్యామల పేర్కొనడం, "ఈ కథల్లో వాదాలు, నినాదాలు లేవు. వాస్తవాలున్నాయి. మానవతా విలువలున్నాయి. ఏ ఇజాలు లేవు కానీ పచ్చినిజాలు ఉన్నాయి. సిద్ధాంత రాద్ధాంతాలు లేవు.. అంతరాత్మను శోధించుకునే అన్వేషణ ఉంది. ఆర్తి ఉంది.. ఇవే దీనిలోని ముడిసరుకు. ఇది చాలు రవీంద్రను ఒక మంచి కథకునిగా నిలబెట్టడానికి".. అని ఆచార్య డా.టి.గౌరీశంకర్ తన అభిప్రాయం వెలిబుచ్చడం ఎంతో సముచితంగా ఉంది. రవీంద్ర మరెన్నో కథలు, కవితలు రాయాలని, తెలుగుసాహిత్యానికి మరెంతగానో సేవ చేయాలని, మరిన్ని మంచి కథా సంపుటాలను వెలువరించాలని ఆశిస్తూ.. అభినందనలు!



సమీక్షకులు:
డా. గంగిశెట్టి శివకుమార్
నెల్లూరు. 9441895343

## విద్యార్థులు...
## నైతిక విలువలు పాటించాలి




బొగ్గరపు రాధాకృష్ణమూర్తిని సన్మానిస్తున్న కళాశాల నిర్వాహకులు

విద్యార్థులు క్రమశిక్షణతో పట్టుదలతో చదువుకోవాలని, నైతిక విలువలు పాటించి సమాజంలో మంచి ఉన్నతస్థాయిని అందుకోవాలని ప్రముఖ కవి, విద్యావేత్త బొగ్గరపు రాధాకృష్ణమూర్తి అన్నారు. ఈనెల 4న నెల్లూరు సమీపంలోని గంగవరంలో ఉన్న గీతాంజలి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కాలేజీ సెమినార్ హాలులో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని 'మానవ సంబంధాలు-నైతిక విలువలు' అనే అంశంపై ఉపన్యసించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు డా.బి.కృష్ణమూర్తి పాల్గొని 'విద్యార్థులు-ఉద్యోగ విజ్ఞాన విషయాలు' అనే అంశంపై ప్రసంగించారు. అనంతరం వీరిరువురినీ కళాశాల ప్రిన్సిపాల్ అభినందించి జ్ఞాపికలు బహుకరించి సన్మానించారు. లయన్స్ క్లబ్ సభ్యులు జె.రవికుమార్, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

# వెంకయ్య పుణ్యాన 'విక్రమ్'ను గుర్తించిన ఇస్రో

శ్రీను గల్పిక

సెప్టెంబర్ 7వ తేదీ... తెల్లారుజామున 2గంటల ప్రాంతం. బెంగుళూరులోని ఇస్రో ప్రధాన కార్యాలయం. ప్రధాని నరేంద్ర మోడీ, ఏఐసిసి మాజీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ, హైటెక్‌రత్న చంద్రబాబునాయుడు, కర్నాటక సీఎం యడ్యూరప్ప, ఉపరాష్ట్రపతి యం. వెంకయ్యనాయుడు, కేంద్రమంత్రులు నిర్మలా సీతారామన్, రాజ్‌నాథ్‌సింగ్, పీయూష్ గోయెల్, ఏపి సిఎం వై.యస్. జగన్మోహన్‌రెడ్డి, పవన్ కళ్యాణ్, ఇస్రో ఛైర్మెన్ శివన్, మాజీఛైర్మెన్ కస్తూరి రంగన్‌లు వున్నారు. అందరు కూడా కంప్యూటర్ స్క్రీన్‌లవైపు ఆసక్తిగా చూస్తున్నారు. షార్ నుండి ప్రయోగించిన చంద్రయాన్-2లోని విక్రమ్ ల్యాండర్ చంద్రుడిపై అడుగుపెట్టబోయే క్షణాలవి... చంద్రయాన్-2 ఒక్కో దశను దాటుకుంటుంటే శాస్త్రవేత్తలు ఆనందంతో చప్పట్లు కొట్టసాగారు. వాళ్ళు చప్పట్లు కొట్టినప్పుడు మన నాయకులకు స్క్రీన్ మీద కనిపిస్తున్న సంకేతాలు అర్థం కాకపోయినా వీళ్ళు కూడా చప్పట్లు కొట్టసాగారు.

అలా విక్రమ్ ల్యాండర్ చంద్రుడి సమీపానికి వచ్చింది. శివన్‌తో పాటు శాస్త్రవేత్తలంతా ఊపిరి బిగపట్టి చూస్తున్నారు. ఇంకో నిమిషంలో చంద్రుడిపై ల్యాండర్ దిగనుండనగా... కంప్యూటర్ స్క్రీన్‌పై ఆ దృశ్యాలు చూస్తున్న శివన్ ముఖంలో ఒక్కసారిగా తెలియని మార్పు చోటుచేసుకుంది. ఆయన కళ్ళల్లో అంతులేని బాధ... ఆయన్ను చూసిన అందరికీ ఏదో జరగరానిది జరిగిపోయిందన్నది అర్థమైపోయింది. ప్రధాని వద్దకు శివన్ వచ్చి... సారీ సార్.. చంద్రుడికి 2.1 కిలోమీటర్ల దూరంలో మిషన్ నుండి సిగ్నల్స్ కట్ అయ్యాయి. మా ప్రయత్నం బూడిదలో పోసిన పన్నీరయ్యిందని ఏడుస్తూ చెప్పాడు. వెంటనే మోడీ శివన్‌ను ఆలింగనం చేసుకుని భుజం తడుతూ... బాధ పడాల్సిందేమీ లేదు శివన్... డైరెక్టర్ ప్రతిఒక్కరు కూడా తన సినిమాను హిట్ కావాలనే తీస్తాడు... కాకపోతే ఒకటి బాహుబలి అవుతుంది, ఇంకోటి సాహో అవుతుంది. అసలు మూడు 'సాహో' సినిమాలను కలిపితే ఒక చంద్రయాన్-2. కాబట్టి ఇలాంటి ప్రయోగాలెన్నో వేయొచ్చు అని ధైర్యం చెప్పాడు. తర్వాత చంద్రబాబు శివన్‌కు ధైర్యం చెబుతూ... నా పేరుతో ఈ ప్రయోగం చేపట్టినందుకు నేనెంతో ఆనందించాను. అయితే దీని విఫలం వెనుక నా రాజకీయ ప్రత్యర్థుల కుట్ర వుందేమోనన్న అనుమానం కలుగుతుంది. చంద్రయాన్ విజయవంతమైతే నా పేరు పాపులర్ అవుతుందనే భయంతోనే దీనిని చంద్రుడి వరకు పోకుండా ఆపారేమోనన్న అనుమానాలు కలుగుతున్నాయి. దీనిపై వెంటనే సిబిఐ దర్యాప్తు జరిపిస్తే బాగుంటుందని చెప్పాడు.

ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు వచ్చి... ఓటములే విజయానికి మెట్లు... అప్పుడప్పుడూ ఓటములు, వైఫల్యాలు కూడా మనకు ఎంతో మేలు చేస్తాయి. 1985లో నేను ఆంధ్రప్రదేశ్, నెల్లూరు జిల్లాలోని ఆత్మకూరు అసెంబ్లీ నియోజకవర్గం నుండి ఓడిపోయాను, అక్కడనుండి అంచలంచెలుగా ఎదిగి ఉపరాష్ట్రపతి దాకా వచ్చాను. అదే ఎమ్మెల్యేగా గెలిచుంటే అక్కడే వుండేవాడినేమో, కాబట్టి జరిగేదంతా మన మంచికే అనుకోండి అని ఓదార్చాడు. వైయస్ జగన్మోహన్‌రెడ్డి లేచి వచ్చి శివన్‌తో... 2019 సంవత్సరానికి ఏపిలో 'చంద్ర' అనే పేరుతో పరిస్థితులు అంతగా కలిసి రావడం లేదు. ఈ ఏడాది ఎన్నికల్లో చంద్రబాబు ఘోర ఓటమే ఇందుకు ఉదాహరణ. 'చంద్ర' అనే పేరుతో గ్రహస్థితులు బలంగా లేని కారణంగా 'చంద్రయాన్' బదులు రాజన్నయాన్ అనో, ఓదార్పుయాన్ అనో దీనికి పేరు పెట్టివుంటే బాగుండేదన్నాడు. ఆయన తర్వాత రాహుల్‌గాంధీ వచ్చి... ల్యాండర్ చంద్రుడికి 2.1కిలోమీటర్ల దూరంలో ఆగిపోయింది కదా.. ఇంకో రాకెట్‌లో మనుషులను అక్కడిదాకా పంపించి ల్యాండర్‌ను చంద్రుడిపైకి నెట్టించలేమా అని అడిగాడు. అప్పుడు రాహుల్ వైపు శివన్... దేశంలో కాంగ్రెస్ ఎందుకు ఇంత ఘోరంగా తయారైందో ఇప్పుడర్థమైందన్నట్లుగా చూశాడు. నేను కూడా ఓదార్చాలనుకున్నట్లు పవన్ కళ్యాణ్ వచ్చాడు. చూడప్పా శివప్పు... సింహంకు నాకు పెద్ద తేడా లేదు... దానికి ఒకటి, రెండు అంతా అడవిలోనే, నేనైతే బాత్‌రూంకు పోతా... మిగతాదంతా సేమ్ టు సేమ్!... పోతే రెండు లక్షల పుస్తకాలు చదివిన అనుభవంతో చెబుతున్నా... ఫెయిల్ అన్నది అప్పుడప్పుడు వరంగా మారుతుంది. నేను టెన్త్ ఫెయిల్.. కాబట్టి ఈరోజు పవర్‌స్టార్‌నయ్యా... అదే పాస్ అయ్యుంటే ఏ కలెక్టర్‌నో అయ్యుండి ఎవరికి పడితే వాళ్ళకు సలాంలు కొడుతుండేవాడిని. కాబట్టి చంద్రయాన్ ఫెయిలయ్యిందని బాధపడొద్దు. రేపు ఇంకా ఎన్నో మంచి విజయాలు మీ ముందుంటాయని ధైర్యం చెప్పాడు. వెంటనే అక్కడే వున్న బాలకృష్ణ.. శివన్‌తో... సార్, నన్ను గట్టిగా తొడ కొట్టమంటారా... ఆ సౌండ్‌కే విక్రమ్ ల్యాండర్ చంద్రుడిపైకి చేరుతుందన్నాడు. వెంటనే వెంకయ్యనాయుడు భయంతో... బాలయ్యా, అంత పని చేయొద్దు, నువ్వు తొడ కొడితే అది చంద్రుడిపైకి చేరుతుందో లేదోగాని, మేమంతా ఆసుపత్రికి చేరుతామన్నాడు. అందరి పరామర్శలు అయ్యాక శివన్, కస్తూరి రంగన్‌లు... సార్ విజయానికి వెంట్రుక వాసి దూరంలో వున్నాం... ల్యాండర్‌ను చంద్రుడిపై దించితే మనం విజయం సాధించినట్లే.. కొంచెం మీరంతా సహకరిస్తే మేము చంద్రయాన్‌తో సిగ్నల్ పునరుద్ధరణపై దృష్టి పెడతామన్నాడు. అందరూ అలాగే నన్నారు. దాంతో శాస్త్రవేత్తలంతా చంద్రయాన్‌తో కమ్యూనికేషన్ కోసం పలు విధాలా ప్రయత్నాలు మొదలుపెట్టారు. కంప్యూటర్‌లలో బటన్‌లు నొక్కుతున్నారు. ఎంత ప్రయత్నించినా వారికి సిగ్నల్స్ అందడం లేదు. విక్రమ్ ల్యాండర్ జాడ కనిపించడం లేదు. ఆ సమయంలో వెంకయ్యనాయుడు సెల్ ఫోన్ రింగయ్యింది. వెంకయ్య ఫోన్ ఆన్ చేశాడు. అవతల నుండి ఆయన సతీమణి ఉషమ్మ... ఏమండీ, టీవీలో ఛానెల్స్ రావడం లేదు, నేను రోజూ చూసే 'ఇత్తడి రేకులు... మామిడి ఆకులు' సీరియల్ వచ్చే టైంఅయ్యింది. ఇప్పుడు కొత్త రిమోట్ కొనే టైం కూడా లేదు. ఇప్పుడెలా చేయాలని అడిగింది. వెంటనే వెంకయ్య... దానికి అంత టెన్షన్ ఎందుకు... రిమోట్‌ను చేతిలోకి తీసుకుని టపీటపీమని నాలుగు సార్లు టేబుల్‌కేసి తట్టు... రిమోట్ దానిపాటికదే పని చేస్తుందని సలహా ఇచ్చాడు. ఆ మాటలు అక్కడే వున్న శివన్ విన్నాడు. ఆయన బుర్ర పాదరసంలా పనిచేసింది. వెంటనే విక్రమ్ ల్యాండర్‌ను కంట్రోల్ చేసే రిమోట్‌ను అక్కడే వున్న టేబుల్‌కేసి టపటపమని బాదాడు. అంతే ఒక్కసారిగా సిగ్నల్స్‌లో కదలిక... కంప్యూటర్ స్క్రీన్‌పై ఆగిన దృశ్యాలు మళ్ళీ వచ్చాయి. చంద్రుడిపై విక్రమ్ ల్యాండర్ దిగి వున్న దృశ్యం కనిపించసాగింది. శివన్ ఆనందంతో కన్నీళ్ళు కారుస్తూ... మొత్తానికి సాఫ్ట్‌గానో హార్డ్‌గానో విక్రమ్ ల్యాండర్ చంద్రుడిపై దిగింది. ఇక కనపడదేమో అని ఆశలు వదులుకున్న 'విక్రమ్' మీ పుణ్యాన కనిపించింది అంటూ వెంకయ్యకు కృతజ్ఞతలు చెబుతూ... మేడమ్ (ఉషమ్మ)కు కూడా నా కృతజ్ఞతలు తెలపండి సార్ అని చెప్పాడు.



# తెలుగుకు... కొత్త వెలుగు

## నెల్లూరుకి ప్రాచీన పీఠం

- మహాకవి తిక్కన పుట్టిన గడ్డపై... గుభాళించనున్న తెలుగు భాషా పరిమళాలు
- ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు చొరవతో కన్నడనాట నుంచి తెలుగు లోగిలికి కదిలొస్తున్న ప్రాచీన తెలుగు భాషా పీఠం
- విజయదశమి రోజున ప్రారంభోత్సవం



**ప్రాచీనమైన మన తెలుగుభాష కొత్త వెలుగులు సంతరించుకోనుంది. రానున్న విజయదశమి పర్వదినం రోజున నెల్లూరులో 'ప్రాచీన తెలుగు భాషా పీఠం' ఏర్పాటు కానుండడం నెల్లూరీయులందరికీ గర్వకారణం. దశాబ్దాలుగా కలగా మిగిలిన ఈ మహత్కార్యాన్ని సాధించేందుకు ఎంతో చొరవతీసుకుని కేంద్రప్రభుత్వాన్ని ఒప్పించిన ఘనత మన సింహపురి ముద్దుబిడ్డ, భారత ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడుగారిదే. ఈ అపూర్వమైన కార్యాన్ని సాధించడం ద్వారా తెలుగుభాషకు, తెలుగుజాతికి..ఇటు పుట్టిన గడ్డకు మరింత ఖ్యాతిని తెచ్చిన మన నెల్లూరీయుడైన వెంకయ్యనాయుడుకు సింహపురి సీమవాసులందరూ మనసారా కృతజ్ఞతాపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నారు.**

నిజంగానే ఇదొక అద్భుతం!..ఎవరూ ఊహించని రీతిలో జరిగిన అద్వితీయమైన కార్యం. భారత ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ఇటీవల మైసూరులోని ఎన్‌సిఇఆర్‌టి ప్రాంగణాన్ని సందర్శించినప్పుడు అక్కడే తెలుగుపీఠం కొనసాగుతున్నట్లు తెలిసి, మైసూరులో ఉన్న ఆ పీఠాన్ని నెల్లూరుకు తరలిస్తే సముచితంగా ఉంటుందనే ఆలోచనతో తన అభిప్రాయాన్ని ఆయన కేంద్ర ప్రభుత్వానికి సూచించగా, అందుకు కేంద్రం సమ్మతిస్తూ గతనెల 29వ తేదిన తగు ఉత్తర్వులను జారీ చేసింది. దీంతో ఆ మేరకు చకచకా ఏర్పాట్లు జరుగుతున్నాయి. నెల్లూరులో ఎన్సీఈఆర్టీ ప్రాంతీయసంస్థ ప్రాంగణంలోని రెండెకరాల విస్తీర్ణంలో ఉన్న స్థలంలో ఈ భాషాపీఠానికి శాశ్వత భవన సముదాయం నిర్మించనున్నారు. అంతదాకా ఈ పీఠాన్ని తాత్కాలికంగా వెంకటాచలం మండలంలోని బిఎంటిపిసి భవనంలో ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం. ఎన్సీఈఆర్టీ భవనాల నిర్మాణం పూర్తయ్యేదాకా ఈ పీఠాన్ని ఇక్కడే నిర్వహించనున్నారు.

### తెలుగువారికి ఇదో వరం...

2008లో అప్పటి మన్మోహన్‌సింగ్ ప్రభుత్వం తెలుగుతో పాటు కన్నడ భాషకు ప్రాచీనహోదా ప్రకటించింది. 2009లో కేంద్రమంత్రివర్గం కూడా అందుకు ఆమోదించింది. ఆమేరకు 2011లో మైసూరులో కన్నడ, తెలుగు ప్రాచీన భాషా పీఠాలను ఏర్పాటుచేశారు. అప్పట్లో తెలుగుభాషా పీఠాన్ని కన్నడనాటలో ఏర్పాటుచేసినా ఆనాటి పాలకులు పెద్దగా పట్టించుకోలేదు. తెలుగు భాషాపీఠాన్ని తెలుగురాష్ట్రాలకు మార్చాలంటూ అప్పట్లో ఎంపీలు గట్టిగా కోరడంతో, అందుకు తగ్గ వసతులు కల్పించిన చోట తెలుగుపీఠం ఏర్పాటుచేస్తామని కేంద్రం స్పష్టం చేసింది. అయితే ఆ తర్వాత ఆ విషయంపై ఎవరూ దృష్టి సారించలేదు. రాష్ట్ర విభజన తర్వాత కూడా కేంద్రం ఈ విషయమై లేఖలు రాసినా తెలుగు రాష్ట్రప్రభుత్వాల నుంచి స్పందన లేకపోవడంతో ఆ విషయం అలాగే మరుగునపడింది. ఇప్పుడు..ఇన్నేళ్ళ తర్వాత భారత ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు తీసుకున్న చొరవతో ప్రాచీన తెలుగుభాషా పీఠం నెల్లూరులో ఏర్పాటు కావడానికి రంగం సిద్ధం కావడం ఎంతో విశేషం. తెలుగుభాషా పరిశోధకులకు, సాహిత్యాభివృద్ధికి, మాతృభాష పరిరక్షణకు ఈ పీఠం బాగా ఉపయోగపడుతుంది. ఒక్కమాటలో చెప్పాలంటే ఇది తెలుగుభాషకు, తెలుగు ప్రజలకు ఒక గొప్ప వరం.

### కవిబ్రహ్మ తిక్కనకు.. నిజమైన నివాళి

తెలుగుకు కొత్త వెలుగులు తెచ్చే ఈ ప్రాచీన తెలుగుభాషా పీఠం నెల్లూరుకు లభించడం..మహాకవి తిక్కనకు ఇది నిజమైన నివాళి అనే చెప్పవచ్చు. భారతేతిహాసమైన మహాభారతాన్ని ఆంధ్రీకరించి తెలుగు భాషాఖ్యాతిని విశ్వవ్యాప్తం చేసిన మహాకవి, కవిబ్రహ్మ తిక్కనసోమయాజి పుట్టిన నెల్లూరుసీమలో ఈ బృహత్తరమైన పీఠం ప్రతిష్ఠితం కానుండడం నెల్లూరుసీమకు ఎంతైనా శుభ పరిణామం. నెల్లూరులోని శ్రీరంగనాధస్వామి దేవాలయం సమీపంలోనే మహాకవి తిక్కన భారతాన్ని ఆంధ్రీకరించారు. నేటికీ పెన్నానది ఒడ్డున .. 'తిక్కన భారతాన్ని తెనిగించిన స్థలం' అందరినీ ఆకట్టుకుంటూ ఉంది.

### మార్గదర్శకుడు మన వెంకయ్య

కన్నతల్లిని, జన్మభూమిని, మాతృభాషను ఎవరూ ఏనాటికీ విస్మరించకూడదనే విషయాన్ని కేవలం మాటల్లో కాక ఇలా చేతల్లో ఆచరించి చూపుతూ, కమ్మనైన మన అమ్మభాషకు కొత్త వెలుగులు ప్రసరింపజేసేందుకు, మాతృభాషను పరిరక్షించుకునేందుకు ఉపరాష్ట్రపతి మన వెంకయ్య చేసిన..చేస్తున్న కృషి అపూర్వం..అద్వితీయం. ఇది అందరికీ మార్గదర్శకం కూడా!...



# భక్తజన సంద్రంగా.. బారాషహీద్ దర్గా

## లక్షలాదిగా తరలివచ్చిన భక్తులు.. రొట్టెల పండుగతో క్రిక్కిరిసిన నెల్లూరు

*భక్తుల కొంగుబంగారంగా, కోరిన కోరికలు తీర్చే పవిత్రమైన దర్గాగా దేశవిదేశాల్లో సైతం ప్రసిద్ధిగాంచిన నెల్లూరు బారా షహీద్ దర్గాకు భక్తజనం వెల్లువగా తరలివచ్చారు. ఎంతో భక్తిశ్రద్ధలతో దర్గాను దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేసుకున్నారు. చెంతనే ఉన్న స్వర్ణాల చెరువులో దిగి తమ కోరికలు నెరవేరాలని కోరుకుంటూ వరాల రొట్టెలు అందుకున్నారు. ఈ నెల 10 నుంచి 14వ తేదీ దాకా జరిగే ఈ పండుగకు దర్గా నిర్వాహకులతో పాటు, మంత్రులు మేకపాటి గౌతమ్‌రెడ్డి, డాక్టర్ పి.అనిల్, జిల్లా కలెక్టర్ శేషగిరిబాబు, జిల్లా ఎస్పీ ఐశ్వర్య రస్తోగి తదితరులంతా కలసి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా భారీ ఏర్పాట్లు చేశారు. లక్షల సంఖ్యలో విచ్చేసిన భక్తులతో ఆధ్యాత్మిక కళతో నెల్లూరులో రొట్టెలపండుగ శోభ వెల్లివిరిసింది.*

రొట్టెలపండుగ అంటేనే అపూర్వమైన రీతిలో జరిగే ఒక విశిష్టమైన పండుగ. ఈ పండుగకు భక్తజనం లక్షల సంఖ్యలో తరలివచ్చారు. ఎంతో పవిత్రమైన నెల్లూరు బారాషహీద్ దర్గా, చెంతనున్న నెల్లూరు స్వర్ణాల చెరువు ప్రాంతమంతా భక్తజనులతో నిండిపోయింది. కులమతాలకు అతీతంగా, ఎంతో పవిత్రంగా జరిగే ఈ రొట్టెల పండుగకు రాష్ట్రం నలుమూలల నుంచే కాక దేశ విదేశాల నుంచి కూడా భక్తులు లక్షలాదిగా తరలివచ్చారు. నెల్లూరు చెరువులోని స్వర్ణాల ఘాట్ భక్తజనులతో క్రిక్కిరిసిపోయింది.

### రాష్ట్రం సుభిక్షంగా ఉండాలి

**- మంత్రుల ఆకాంక్ష**

రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని కోరుకుంటూ రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి డా.పోలుబోయిన అనిల్‌కుమార్ యాదవ్, పరిశ్రమలశాఖ మంత్రి మేకపాటి గౌతంరెడ్డి దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, రాష్ట్ర ప్రజలంతా సుభిక్షంగా, సుఖశాంతులతో జీవించాలని కోరుకుంటూ స్వర్ణాల చెరువులో దిగి సుభిక్షం రొట్టెలను స్వీకరించారు. ఎంతోమంది ప్రముఖులు, లక్షలాదిగా తరలివచ్చిన భక్తులు అందరూ తమ కోరికలు నెరవేరాలని కోరుకుంటూ రొట్టెలు పట్టుకున్నారు.



### ప్రముఖుల సందర్శన

రాష్ట్ర ఉపముఖ్యమంత్రి అంజాద్ బాషా, మంత్రులు మేకపాటి గౌతమ్‌రెడ్డి, డాక్టర్ పి.అనిల్‌కుమార్‌యాదవ్, ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులురెడ్డితో పాటు ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, గిరిధర్‌రెడ్డి, రూప్‌కుమార్‌యాదవ్, నాయకులు కొండ్రెడ్డి రంగారెడ్డి, ముక్కాల ద్వారకానాధ్, ఎం.డి ఖలీల్‌అహ్మద్, ఎస్ఆర్ ఇంతియాజ్, మున్నా తదితర ప్రముఖులు పాల్గొన్నారు. మరోవైపు జిల్లా కలెక్టర్ ఎంవి శేషగిరిబాబు నేతృత్వంలో ఉన్నతాధికారులు, అనేకశాఖల అధికారులు, వక్ఫ్‌బోర్డు అధికారులు రొట్టెల పండుగ ఏర్పాట్లను ఎంతో పటిష్టంగా నిర్వహించారు. జిల్లా ఎస్పీ ఐశ్వర్య రస్తోగి ఆధ్వర్యంలో జిల్లా జిల్లా పోలీసు సిబ్బంది అడుగడుగునా భద్రతా ఏర్పాట్లు చేసి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పర్యవేక్షించారు. పోలీసు కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి ఏర్పాట్లను పర్యవేక్షించారు. సిసి కెమెరాల నిఘాతో అన్ని ప్రాంతాల్లో పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు. వేల సంఖ్యలో నెల్లూరుకు తరలివచ్చిన వాహనాలకు పార్కింగ్ ఏర్పాట్లు చేసి బందోబస్తును పటిష్టంగా నిర్వహించారు.



### వేడుకగా గంధోత్సవం

రొట్టెలపండుగ సందర్భంగా ఈనెల 11న గంధోత్సవం ఎంతో వేడుకగా జరిగింది. మేళతాళాలతో, పూలఅలంకరణలతో ముజావర్లు, ఫకీర్ల గీతాలాపనలతో రొట్టెలపండుగ కమిటీ ఛైర్మెన్ అబ్దుల్‌రజాక్, వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ అహ్మద్‌బాషా ఆధ్వర్యంలో నెల్లూరు కోటమిట్టలోని అమినియా మసీదులో 12 స్టీలు బిందెల్లో సుగంధద్రవ్యాలతో కలపి అత్యద్భుతమైనరీతిలో గంధాన్ని తయారు చేశారు. మతపెద్దలు జెండాలు పట్టుకుని ముందువైపు నడుస్తుండగా, బాణసంచా వేడుకల మధ్య గంధపు బిందెలను బారాషహీద్ దర్గాకు ఊరేగింపుగా తీసుకునివచ్చారు. కడప పెద్దదర్గా పీఠాధిపతి అరీఫుల్లా హుస్సేనీ చేతులమీదుగా లేపనం చేసి ఆ గంధాన్ని భక్తులకు పంచిపెట్టారు.

ఈ సందర్భంగా నెల్లూరు చెరువులో కోర్కెల రొట్టెలు పట్టుకుంటున్న భక్తులపై నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో పారాగ్లైడర్ ద్వారా పుష్పవర్షం కురిపించి అందరినీ ఆనందపరవశులను చేశారు.

### పెద్దఎత్తున సేవా కార్యక్రమాలు

ప్రతియేటా రొట్టెల పండక్కు వచ్చే లక్షలాది మంది భక్తుల కోసం నెల్లూరుజిల్లాకు చెందిన వివిధ సేవాసంస్థలు పలు సేవా కార్యక్రమాలు చేపడుతుంటాయి. వైసిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి ఆధ్వర్యంలో దాదాపు 50వేల మంది భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కృష్ణపట్నం పోర్టు ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రాన్ని నిర్వహించారు. అలాగే రోటరీ, సిఎంఆర్, షిరిడి సాయిబాబా మందిరం, పలు ఆసుపత్రుల వాళ్ళు ఉచిత అన్నదాన, వైద్య శిబిరాలు నిర్వహించారు. అవెన్యూ స్కూలు వారు భక్తులకు ఉచిత రవాణా సౌకర్యం కల్పించారు.

మొత్తానికి నగరపాలక సంస్థ, పోలీస్, విద్యుత్ శాఖ, రెవెన్యూ, ఇంకా పలు ప్రభుత్వశాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ ఈసారి పండుగను జయప్రదంగా నిర్వహిస్తున్నారు.

# 'స్పందన'లో అర్జీలు స్వీకరించిన ఎస్పీ



నెల్లూరు జిల్లా పోలీసు కార్యాలయంలో ఈనెల 9న జిల్లా ఎస్పీ ఐశ్వర్య రస్తోగి ఆధ్వర్యంలో స్పందన కార్యక్రమం జరిగింది. జిల్లా నలుమూలల నుంచి బాధితులు వచ్చి తమ సమస్యలను వినతుల రూపంలో ఎస్పీకి అందజేశారు. వాటిని పరిశీలించిన ఎస్పీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులతో మాట్లాడారు. సమస్య పరిష్కారంలో జాప్యానికి గల కారణాలను తెలుసుకున్నారు. త్వరగా పరిష్కరించేందుకు తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రజా సమస్యల విషయంలో నిర్లక్ష్యంగా వున్నా, ప్రజలతో అమర్యాదగా వ్యవహరించినా చర్యలు తీసుకుంటామని సిబ్బందిని హెచ్చరించారు. ఎస్బీ డీఎస్పీ ఎస్. కోటారెడ్డి, నెల్లూరు రూరల్ డీఎస్పీ కేవీ రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఆదిశేషారెడ్డి సాహితీ సేవ అమోఘం




'నీ రాక కోసం' పుస్తకావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యఅతిథులు

ప్రముఖ సాహితీవేత్త కైపు ఆదిశేషారెడ్డి సాహిత్యసేవ అమోఘమని వక్తలు కొనియాడారు. ఈ నెల 10న నెల్లూరులోని శ్రీ వేంకటేశ్వర విద్యాలయంలో ఆదిశేషారెడ్డి రచించిన 'ఓడిన కుందేలు', 'నీ రాక కోసం', 'ఆలోచించండి' అనే మూడు పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రముఖ బాలసాహితీవేత్త డా. గంగిశెట్టి శివకుమార్ మాట్లాడుతూ గత 45 ఏళ్ళుగా రచనారంగంలో ఉన్న ఆదిశేషారెడ్డి బాలసాహితీవేత్తగా, మంచి రచయితగా రాష్ట్రవ్యాప్తంగా గుర్తింపు పొందారని, ఆయన రచనలు ఎంతో విశిష్టమైనవని ప్రశంసించారు. అనంతరం ఆదిశేషారెడ్డిని పలువురు కవులు, రచయితలు ఘనంగా సన్మానించారు. గురువులు, తల్లిదండ్రుల ఆశీర్వాద బలంతోనే తాను రచనా రంగంలో ఉన్నానని, ఇప్పటికి 15 పుస్తకాలు వెలువరించగలిగానని ఆదిశేషారెడ్డి ఈ సందర్భంగా పేర్కొన్నారు. తెలుగుభాషోద్యమ నాయకుడు చలంచర్ల భాస్కర్‌రెడ్డి, కవులు ఈతకోట సుబ్బారావు, బొగ్గరపు రాధాకృష్ణమూర్తి, డా. బెల్లంకొండ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# నేత్రదానాన్ని ప్రతిఒక్కరూ ప్రోత్సహించాలి




ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న డాక్టర్ శ్రీహరి

నేత్రదానాన్ని ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ రాజ్యలక్ష్మి సూచించారు. నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా నెల్లూరు రెడ్‌క్రాస్ సమావేశ మందిరంలో నిర్వహించిన ముగింపు సమావేశంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముందుగా గాంధీ బొమ్మ నుంచి రెడ్‌క్రాస్ వరకు జరిగిన అవగాహన ర్యాలీని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నిర్మలా దేవి, ప్రభుత్వ వైద్యకళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీహరి పాల్గొని జెండా వూపి ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎం హెచ్ఓ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ నేత్ర దానంపై కుటుంబసభ్యులకు అవగాహన కల్పించాలన్నారు. ఒక వ్యక్తి నేత్రదానం చేయడం వల్ల ఇద్దరికి చూపును ప్రసాధించవచ్చన్నారు. మాజీ ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ అశోక్ మాట్లాడుతూ చనిపోయిన తర్వాత వేరొకరి జీవితాల్లో వెలుగును నింపే గొప్ప అవకాశం నేత్రదానమన్నారు. అనంతరం నేత్రదానాన్ని ప్రోత్సహిస్తున్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులను సత్కరించారు. నేత్రదానంపై నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. మోడరన్ ఆస్పత్రి కార్నియా మార్పిడి వైద్యురాలు డాక్టర్ జ్యోతి, జిల్లా అంధత్వ నివారణాధికారి డాక్టర్ మంజులమ్మ, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శిరీషా, స్వచ్ఛంధ సంస్థల జిల్లా అధ్యక్షుడు ఈవీయస్ నాయుడు, నెల్లూరు ఐ డోనర్స్ సంస్థ అధినేత తిక్కవరపు సుకుమార్‌రెడ్డి, పీఎంపీ అసోసియేషన్ అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్ పాల్గొన్నారు.

# ఓటర్ల జాబితా పరిశీలన వేగవంతం చేయండి

నెల్లూరు జిల్లాలో ఓటర్ల జాబితా పరిశీలన కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి జి.మల్లిఖార్జున అధికారులను ఆదేశించారు. ఈనెల 11న కలెక్టరేట్‌లోని తమ ఛాంబర్ నుంచి ఓటర్ల జాబితా పరిశీలనపై టెలీకాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ ఈనెల 1వతేదీ నుంచి ఈ కార్యక్రమం ప్రారంభమయిందని అక్టోబర్ 15వ తేదీలోగా పూర్తి చేయాల్సి వుందన్నారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఆండ్రాయిడ్ మొబైల్ ఫోన్ యాప్ ద్వారా వివరాలు సేకరించాలని, మార్పులు చేర్పులు చేయాలన్నారు. సూపర్‌వైజర్లు, బూత్‌స్థాయి అధికారులకు శిక్షణ ఇవ్వాలన్నారు. ఫారం 6, 6ఎ. 7, 8, 8ఎ క్లైయిములు 66,470 వచ్చాయని, వాటిలో ఇంకా 38,938 పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని సత్వరమే పరిష్కరించాలన్నారు. పోలింగ్ కేంద్రాల సరిహద్దులు ఈనెల 15లోగా సిద్ధం చేయాలన్నారు. 2020 జనవరి 1 వ తేదీకి 18 ఏళ్ళు నిండే కొత్త ఓటర్లు కూడా ఓటరుగా నమోదు కోసం దరఖాస్తు చేసుకునే విధంగా చైతన్యం కల్పించాలన్నారు. ఎన్నికల విభాగం పర్యవేక్షకులు సునీల్, ఎన్ఐసీ డీఐవో సురేష్, ఎన్నికల డీటీలు, సీనియర్ అసిస్టెంట్లు, ఈ–డివిజినల్ మేనేజర్లు, ఎన్నికల విభాగం అధికారి బషీర్ పాల్గొన్నారు.

## 14 నుంచి అంతర్ జిల్లా
# బ్యాడ్మింటన్ పోటీలు

నెల్లూరు జిల్లా పొదలకూరులో ఈనెల 14 నుండి 16వతేదీ వరకు మూడురోజుల పాటు సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్ రెడ్డి పర్యవేక్షణలో అంతర్ జిల్లాల బాల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తున్నట్లు బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తోట మనోహరం పేర్కొన్నారు. పొదలకూరు డీఎన్నార్ జెడ్పీ హైస్కూల్లో అసోసియేషన్ జిల్లా ఛైర్మన్ మురళీకృష్ణారెడ్డితో కలిసి ఈనెల 10న క్రీడా మైదానాన్ని వారు పరిశీలించారు. ఈ సందర్భంగా మనోహరం మాట్లాడుతూ 13 జిల్లాల నుంచి అండర్–16 బాలబాలికలు పోటీల్లో పాల్గొంటారన్నారు. క్రీడాకారులకు పొదలకూరు పాఠశాలల్లోనే భోజన, వసతి కల్పించనున్నట్లు తెలిపారు. జిల్లా ఛైర్మన్ మురళీకృష్ణారెడ్డి మాట్లాడుతూ 13 జిల్లాల నుండి సుమారు 350 మంది క్రీడాకారులు హాజరవుతున్నట్లు తెలిపారు. అసోసియేషన్ జిల్లా జాయింట్ సెక్రటరి చొప్పా వెంకటేశ్వర్లు, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరి వాకాటి శ్రీనివాసులురెడ్డి, దేవరం రఘురామిరెడ్డి, శివప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

# పల్నాటి యుద్ధం

(మొదటి పేజీ తరువాయి)

5ఏళ్ళలో గురజాల ఎమ్మెల్యేగా యరపతినేని శ్రీనివాసరావు సాగించిన అక్రమ మైనింగ్‌కు అడ్డు అదుపు లేదు. వీళ్ళు సాగించిన దౌర్జన్యాలకు కొలమానం లేదు. ఎన్నో దాడులు జరిగాయి. ఎందరో వీధులపాలయ్యారు. గత ఐదేళ్లలో వీరి దాష్టికాలకు బలైనవారిని చూస్తే పల్నాడులో ఊరికొక టిడిపి బాధితుల పునరావాస శిబిరం పెట్టాల్సి వుండేది. కోడెల ఆగడాలపై ప్రజలు ఎంతగా విసిగిపోయారనేందుకు ఎన్నికల రోజున పోలింగ్ బూత్‌ను ఆక్రమించుకున్న ఆయనను చితక్కొట్టడమే పెద్ద ఉదాహరణ.

తెలుగుదేశం ప్రభుత్వం ఐదేళ్ళ కాలంలో పల్నాడులో పచ్చమాఫియా రాజ్యమేలింది. తెలుగుదేశం పార్టీ ముద్ర లేనివాళ్ళు బిక్కుబిక్కుమంటూ గడిపారు. ఆరోజులతో పోలిస్తే పల్నాడు ఇప్పుడు బాగానే వుంది. అక్కడున్న ప్రస్తుత వైసిపి ఎమ్మెల్యేలెవరు కూడా ఫ్యాక్షన్ నేపథ్యమున్నోళ్ళు కాదు. యువకులు, విద్యావంతులు, వ్యాపారవేత్తలు ఎమ్మెల్యేలుగా వున్నారు. కేవలం ఒక గ్రామంలో జరిగిన ఘర్షణను అడ్డుపెట్టుకుని చంద్రబాబు తన మాఫియా లీడర్లను కేసుల నుండి కాపాడుకోవడానికి ఈ 'పల్నాటి యుద్ధం' సీన్ సృష్టిస్తున్నాడు.

# 'మెగా'కే పోలవరం

(మొదటి పేజీ తరువాయి)

పోలవరం పాత కాంట్రాక్ట్‌ను రద్దు చేశాడు. రివర్స్ టెండరింగ్‌కు శ్రీకారం చుట్టాడు. ఇప్పుడు నవయుగ వాళ్ళు రివర్స్ టెండరింగ్‌లో పాల్గొనలేరు. పాల్గొన్నా గతానికంటే తక్కువ కొటేషన్‌కు వేయలేరు. పోలవరం ప్రాజెక్ట్ కోసం మిగతా కంపెనీలేవీ కూడా ముందుకొచ్చే పరిస్థితులు లేవు. ఉన్న అవకాశమల్లా మెగా ఇంజనీరింగ్ సంస్థే! గత అంచనాల కంటే 5శాతం తక్కువతో రివర్స్ టెండరింగ్ ద్వారా ఈ సంస్థే పోలవరం ప్రాజెక్ట్ కాంట్రాక్ట్‌ను దక్కించుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# రెండో రాజధానిగా భాగ్యనగరం?

(మొదటి పేజీ తరువాయి)

## దక్షిణ భారతంపై పట్టు కోసం...

బీజేపీకి ఉత్తరభారత పార్టీగా పేరుంది. దక్షిణ భారత రాష్ట్రాలలో ఆ పార్టీకి అంతంత మాత్రమే పట్టుంది. ఒక్క కర్నాటక రాష్ట్రంలో తప్పితే ఇంకెక్కడా బీజేపీ అధికారపక్షంగా గాని, ప్రతిపక్షంగా గాని లేదు. కేరళ, తమిళనాడు రాష్ట్రాలలో అయితే దరిదాపుల్లో కనీసం ప్రతిపక్ష స్థాయికి వచ్చే అవకాశాలు కూడా లేవు. ఆ పార్టీకి ఆశలు వున్నదల్లా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ల మీదే! తెలంగాణలో కాంగ్రెస్‌ను కేసీఆర్ భూస్థాపితం చేస్తున్నాడు. దాని స్థానంలో మొలకెత్తిన బీజేపీ వల్లే ఆయన అసలు ప్రమాదాన్ని ఎదుర్కోబోతున్నాడు. అధికారంలో వున్న పార్టీకి కాంగ్రెస్‌కన్నా బీజేపీ డేంజర్. టిఆర్ఎస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో వ్యతిరేకత వస్తేనే కాంగ్రెస్‌కు అవకాశముంటుంది. ఎందుకంటే వీళ్ళకు సొంతంగా పోరాడే శక్తి తక్కువ. బీజేపీ అలా కాదు. కేసీఆర్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత లేకపోయినా బీజేపీ వాళ్ళు తెప్పించేలాగా పోరాడతారు. అధికారం కోసం చేసే పోరాటంలో ఎక్కడా వెనక్కితగ్గరు. నిన్నటి లోక్‌సభ ఎన్నికల్లోనే బీజేపీ ఎంత ప్రమాదకరమో కేసీఆర్‌కు తెలిసొచ్చి వుండాలి.

## హైదరాబాద్‌పై బీజేపీ ఆధిపత్యం..

హైదరాబాద్‌ను కేంద్రపాలిత ప్రాంతం చేస్తే ఇటు హైదరాబాద్‌లోనూ, అటు తెలంగాణలోనూ బీజేపీ తొందరగా విస్తరించగలదు. హైదరాబాద్ నగరంలో టిఆర్ఎస్‌కు సంస్థాగత బలం లేదు. కేవలం తెలుగుదేశం, వైసిపి, కొంతవరకు కాంగ్రెస్ కేడర్ అంతా కలవబట్టే అక్కడ టిఆర్ఎస్ కనిపిస్తోంది. కాని, బీజేపీకి సంస్థాగత బలం వుంది. ఆంధ్రులతో పాటు ఉత్తరాది రాష్ట్రాలవాళ్ళు ఇక్కడ పెద్దఎత్తున స్థిరపడివున్నారు. వీరంతా కూడా మజ్లిస్‌కు వ్యతిరేకంగా బీజేపీకి మద్దతుగా నిలుస్తారు. గ్రేటర్ హైదరాబాద్ విస్తరిస్తున్న కొద్ది మజ్లిస్ ప్రాబల్యం కూడా తగ్గిపోతుంది. కాబట్టి హైదరాబాద్‌పై ఆధిపత్యం వహించడానికి బీజేపీకి పెద్ద సమయం పట్టకపోవచ్చు. అదే సమయంలో వరంగల్ రాజధానిగా ఏర్పడే తెలంగాణలోనూ బీజేపీ వేగంగానే విస్తరించొచ్చు.

## వై.యస్. ఆలోచన అదే!

హైదరాబాద్‌ను దేశానికి రెండో రాజధానిని చేయాలని, వరంగల్ రాజధానిగా తెలంగాణ, ఒంగోలు రాజధానిగా ఆంధ్రప్రదేశ్‌లను ఏర్పాటు చేయాలన్నది దివంగత నేత డాక్టర్ వై.యస్.రాజశేఖరరెడ్డి చేసిన ఆలోచన. 2009లో రెండో పర్యాయం అధికారంలోకి వచ్చాక ఆయన పూర్తికాలం వుండుంటే కేంద్రం ద్వారా దీనిని అమలులోకి తెచ్చేవాళ్ళు. కాని, రెండోసారి అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే ఆయన మరణించడంతో ఈ ఆలోచన ఆచరణ రూపం దాల్చకపోగా, ఆ తర్వాత రాష్ట్ర విభజనను కుక్కలు చించిన విస్తరి మాదిరిగా జరపడం తెలిసిందే!

ఈ నెల 17న తెలంగాణ విమోచన దినోత్సవం. బీజేపీ వాళ్ళు దీనిని ఘనంగా జరపాలనుకుంటున్నారు. అలాగే ఆరోజు తర్వాతే హైదరాబాద్, తెలంగాణల విషయంలో కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశాలు కూడా కనిపిస్తున్నాయి.



రాజకీయాలలో ఒక పార్టీ ఎదగాలి అంటే ఇంకో పార్టీ అంతరించిపోవాలి. దేశంలోని చాలా రాష్ట్రాలలో ప్రస్తుతం జరుగుతున్న రాజకీయ పరిణామక్రమమిదే!

# టీడీపి కోలుకుంటే బీజేపీదే తప్పు

అస్సాంలో ఏజిపి బలహీనపడితే దాని స్థానాన్ని బీజేపీ ఆక్రమించింది. హర్యానాలో హర్యానా లోక్‌దళ్ స్థానాన్ని కూడా బీజేపీయే చేజిక్కించుకుంది. పశ్చిమబెంగాల్‌లో కమ్యూనిష్టులు బలహీనపడితే ఆ స్థానం కోసం బీజేపీ పోరాడుతోంది. ఒరిస్సాలో కాంగ్రెస్‌ను బలహీనపరచి బీజేపీ బలపడుతోంది. రేపు తెలంగాణలోనూ కాంగ్రెస్ స్థానంలోకి బీజేపీ రాబోతుంది. ఇలా ఒక పార్టీ తెరమరుగైన చోటల్లా బీజేపీ దాని స్థానంలోకి వచ్చేస్తోంది. మరి ఆంధ్రప్రదేశ్‌లో పరిస్థితి ఏంటి? ఏపిలో బీజేపీ ఎప్పుడో బలపడి వుండాలి. కాని, బీజేపీ సమకాలంలోనే పుట్టిన తెలుగుదేశం పార్టీయే ఆ పార్టీని ఏపిలో వేళ్లూనుకోకుండా చేసింది. 1980 దశకంలోనే బీజేపీ, టీడీపీలు ఆవిర్భవించాయి. ఏపిలో జాతీయ పార్టీగా కాంగ్రెస్, ప్రాంతీయ పార్టీగా తెలుగుదేశం వుండడంతో బీజేపీకి విస్తరించే అవకాశమే లేకుండాపోయింది. ఈ రెండు పార్టీలలో ఏదో ఒకటి పూర్తిగా బలహీనపడితేనే బీజేపీ దాని స్థానంలో బలపడగలదు. అయితే రాష్ట్రంలో తెలుగుదేశం ఎప్పుడో బలహీనపడాల్సి వుండేదే. అయితే 1999, 2014 ఎన్నికల్లో ఆ పార్టీని బలం పుంజుకునేలా చేసింది, అధికారంలోకి వచ్చేలా చేసింది బీజేపీ నాయకత్వమే! ఆ పార్టీతో పొత్తు వల్లే ఆ రెండుసార్లు కూడా తెలుగుదేశం అధికారంలోకి వచ్చి చంద్రబాబు ముఖ్యమంత్రి కాగలిగాడు. మొన్నటి ఎన్నికల దాకా కూడా ఈ రాష్ట్రంలో బలపడాలనే లక్ష్యం వైపు బీజేపీ శ్రేణులు కూడా పెద్దగా పనిచేసింది లేదు.

ఇప్పుడు రాష్ట్రంలో రాజకీయ వాతావరణం పూర్తిగా మారిపోయింది. రాష్ట్రంలో రెండు బలమైన రాజకీయ శక్తులు కోలుకోలేని దెబ్బతిని వున్నాయి. రాష్ట్ర విభజన మూలంగా 2014లోనే ఈ రాష్ట్రంలో కాంగ్రెస్ మట్టి కొట్టుకుపోయింది. ఏపిలో ఆ పార్టీ ఇక కోలుకునే పరిస్థితులు లేవు. ఇక నిన్నటి ఎన్నికలతో తెలుగుదేశం కూడా బలహీనపడినట్లే! ఆ పార్టీ అధినేత చంద్రబాబుకు వయసు మళ్లింది. సమర్ధవంతంగా పార్టీని నడపలేకపోవచ్చు. వారసుడు లోకేష్ వుంటే పార్టీని నడిపేంత శక్తి సామర్ధ్యాలు లేవు. కాబట్టి అటు కాంగ్రెస్ అంతరించిపోవడం, ఇటు తెలుగుదేశం బలహీనపడడం రాష్ట్రంలో విస్తరించడానికి బీజేపీకి వున్న మంచి అవకాశం. ఇలాంటి వాతావరణంలో కూడా మళ్ళీ గనుక టీడీపీకి కోలుకునే అవకాశం ఇస్తే అది ఖచ్చితంగా బీజేపీ తప్పే అవుతుంది. తదుపరి ఎన్నికలకు తెలుగుదేశం రెండో స్థానంలో వున్నా, ఇక సుదూర కాలంలో ఏపిలో బీజేపీకి అవకాశాలు కనిపించవు.

2019 ఎన్నికల తర్వాత రాష్ట్రంలో వైసిపి అత్యంత బలీయమైన పార్టీగా అవతరించింది. తెలుగుదేశం చరిత్రలో ఎన్నడూ లేనంతగా బలహీనపడింది. తెలుగుదేశం శ్రేణులు చంద్రబాబు నాయకత్వంపై నమ్మకం కోల్పోతున్నాయి. ఈ క్రమంలోనే కొందరు ఆ పార్టీ నాయకులు బీజేపీలో చేరుతున్నారు. ఇంకొందరు నాయకులు తమ మీదున్న అవినీతి కేసుల నుండి బయపడేందుకు బీజేపీలో చేరడం తెలిసిందే! భవిష్యత్‌లో ఇంకొందరు టీడీపీ నాయకులు కూడా బీజేపీలో చేరనున్నట్లు సమాచారం. నిన్నటి ఎన్నికల్లో టీడీపీని వైసిపి చావుదెబ్బ తీసింది. ఇక మిగిలివున్న అరకొర ఆశలను బీజేపీయే అణచేయాలి. టీడీపీ పూర్తిగా బలహీనమైతే ఈ రాష్ట్రంలో బీజేపీకి అవకాశం. వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి రాకపోయినా కనీసం రెండో స్థానంలో అయినా నిలవగలుగుతుంది. ఏపిలోనూ విస్తరించాలన్న కల నెరవేరుతుంది. అలా కాకుండా మళ్ళీ టీడీపీకి ఏ మాత్రం కోలుకునే అవకాశం ఇచ్చినా... ముమ్మాటికీ అది బీజేపీ చారిత్రక తప్పిదమే అవుతుంది.

## 17న విశాఖలో సుబ్బరామయ్య..

# పుట్టినరోజు సంబరాలు

## – విఖ్యాత నటీమణి జయసుధకు 'అభినయ మయూరి' బిరుదు ప్రదానం



రాజ్యసభ సభ్యుడు, అందరికీ మిత్రుడు..మన నెల్లూరీయుడు కళాబంధు డా. టి.సుబ్బరామిరెడ్డి జన్మదినోత్సవ వేడుకలు ఈనెల 17న విశాఖపట్నంలో అంగరంగ వైభవంగా జరుగనున్నాయి. ప్రతిఏటా తన పుట్టినరోజును ఒక పండుగలా నిర్వహించుకోవడం, ఆ రోజున మరెంతోమందిని గౌరవించి సన్మానించి వారిలో ఆనందాన్ని చూడడం మన సుబ్బరామయ్యకి ఎంతో సంతృప్తిని కలిగించే విషయం. అందుకే ప్రతిఏటా తన పుట్టినరోజున ఎంతోమంది ప్రఖ్యాత కళాకారులను, ఆధ్యాత్మిక వేత్తలను ఆహ్వానించి వారిని ఘనంగా సత్కరిస్తుంటారు. ఈ సత్సం ప్రదాయాన్ని ఒక ఆనవాయితీగా పెట్టుకుని ఎన్నో ఏళ్ళుగా ఈ వేడుకలను ఆద్యంతం అద్భుతంగా నిర్వహిస్తున్న సుబ్బరామన్న జన్మదినోత్సవమంటే.. అక్షరాలా సాహిత్య, ఆధ్యాత్మిక, కళారంగాలకు ఒక పండుగే. టిఎస్సార్ లలిత కళాపరిషత్ ఆధ్వర్యంలో జరుగనున్న ఈ వేడుకలు 16, 17 తేదీల్లో రెండురోజుల పాటు ఎంతో ఆహ్లాదంగా, ఉత్సాహంగా జరుగుతాయి. 16వ తేదీన విశాఖలోని ఉడా చిల్డ్రన్ థియేటర్‌లో జరిగే కార్యక్రమంలో ప్రఖ్యాత ఆధ్యాత్మికవేత్తలను ఆహ్వానించి వారిని ఘనంగా సత్కరించి గౌరవిస్తారు. వారి నుంచి ఆధ్యాత్మిక సందేశాలను, అనుగ్రహభాషణలను, ఆశీస్సులను అందుకుంటారు.



### జయసుధకు అపూర్వ సత్కారం...

ఈ వేడుకల్లో భాగంగా ఈనెల 17న విశాఖ కళావని ఆడిటోరియంలో జరిగే కార్యక్రమంలో 46 ఏళ్ళుగా సినీరంగ ప్రస్థానంలో విలక్షణ నటనా వైదుష్యంతో విఖ్యాత నటీమణిగా ఖ్యాతిగాంచిన డా. జయసుధకు 'అభినయ మయూరి' అనే విశిష్టమైన బిరుదును టి. సుబ్బరామిరెడ్డి ప్రదానం చేసి ఘనంగా సత్కరించనున్నారు. ఈ కార్యక్రమంలో ఎంతోమంది సినీప్రముఖులు, ఆధ్యాత్మికవేత్తలు, రాజకీయ ప్రముఖులు పాల్గొంటారు. ప్రత్యేకించి మన నెల్లూరీయులైన ఎంపీలు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆదాల ప్రభాకర్‌రెడ్డి, మాగుంట శ్రీనివాసులురెడ్డి, విజయసాయిరెడ్డి పాల్గొననున్నారు. తన పుట్టినరోజు వేడుకలను ఆధ్యాత్మిక, సాహిత్య, కళారంగాల వారికి అపూర్వమైన పండుగ వేడుకలా నిర్వహిస్తున్న మన సుబ్బరామయ్యకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తోంది.. లాయర్!

## నాయకులకు సమస్యగా మారిన...

# కొలువుల జాతర

ముఖ్యమంత్రి వై.యస్.జగన్మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న ఉద్యోగాల భర్తీ మాటేమోగాని, ఈ కొలువుల జాతర నియోజకవర్గాలు, మండలాలు, గ్రామస్థాయిలలో వున్న వైసిపి నాయకులకు తలనొప్పిగా మారింది. మొన్న ఎన్నికల్లో వైసిపి కోసం పనిచేసిన యువకులంతా కూడా ఉద్యోగాలిప్పించండంటూ నాయకుల వద్దకు పరుగులు తీస్తున్నారు. ప్రతి గ్రామంలోనూ పార్టీకి పనిచేసిన వాళ్ళ సంఖ్య ఎక్కువగావుండడం, అక్కడ కొలువులు తక్కువగా వుండడంతో ఎవరికి సిఫారసు చేయాలో తెలియక నాయకులు తలలు పట్టుకుంటున్నారు. అదీగాక గ్రామ సచివాలయం పోస్టుల ఎంపికలో రాజకీయ సిఫారసులు పనిచేసే అవకాశం లేకపోవడంతో నాయకులకు ఇదొక సమస్యగా మారింది.

ఇటీవల ప్రతి గ్రామంలో, వార్డులలో వాలంటీర్లను నియమించడం తెలిసిందే! ఒక ఊరిలో నాలుగు ఉద్యోగాలున్నాయనుకుంటే, నలభైమంది పోటీపడ్డారు. ఆ గ్రామ వైసిపి నాయకుడు వీరిలో ఓ నలుగురు పేర్లను ప్రతిపాదించి ఉద్యోగాలు తెప్పించాడనుకుందాం... వాలంటీర్ ఉద్యోగం రాని మిగతా 36మంది ఆ నాయకుడికి వ్యతిరేకమయ్యారు. ఇలా ఉద్యోగాలతో కూడా నాయకులు చెడ్డవాళ్ళవుతున్నారు.

ఇక, సచివాలయం ఉద్యోగుల ఎంపికను అత్యంత పకడ్బందీగా నిర్వహిస్తున్నారు. సిఫారసులకు ఎక్కడా అవకాశాలివ్వడం లేదు. మంత్రులు, ఎమ్మెల్యేల మాట కూడా చెల్లుబాటయ్యే అవకాశం కనిపించడం లేదు. మన ప్రభుత్వం వచ్చాక కూడా కనీసం నలుగురు మనోళ్ళకు ఉద్యో గాలిప్పించుకోలేకపోతే ఎట్లాగబ్బా అనే అసంతృప్తితో వైసిపి నాయకులున్నారు. అలాగే జిల్లాలో 280 ప్రభుత్వ మద్యం షాపులను ఏర్పాటు చేయబోతున్నారు. వీటిలో 280 సూపర్‌వైజర్ పోస్టులు, 665 సేల్స్‌మెన్ పోస్టులున్నాయి. మొత్తం ఈ రెండు రకాల ఉద్యోగాలకు 7వేలమందికి పైనే దరఖాస్తు చేశారు. మద్యం షాపుల్లో ఉద్యోగాలకు కూడా అభ్యర్ధులు రాజకీయ నాయకుల వద్దకు పరుగులు తీస్తున్నారు. ఆయా గ్రామాలు, వార్డుల నుండి నాయకులు తమ అభ్యర్ధుల జాబితాలను తెచ్చి ఎమ్మెల్యేలకిస్తున్నారు. వచ్చిన అభ్యర్ధులు ఎక్కువ, ఉద్యోగాలు తక్కువగా వుండడంతో ఎవరికివ్వాలో తెలియక ఎమ్మెల్యేలు తలలు పట్టుకుంటున్నారు.






Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com